Follow: @ANNTELUGU

06-08-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 243 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




**టాప్ న్యూస్**

## నెంబర్ వన్ అమిత్ షా



- దేశ రాజకీయాల్లో అమిత్ షా తిరుగులేని రికార్డ్
- ఎక్కువ కాలం కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు
- అద్వానీ రికార్డు బ్రేక్

02


## రాజీనామాకు రెడీ



- అవసరమైతే మునుగోడుకు ఉప ఎన్నిక తెస్తా
- మంత్రి పదవి ఇస్తారా.. ఇవ్వరా అధిష్టానం ఇష్టం
- వాటి కోసం కాళ్ళు పట్టుకునే నైజం నాది కాదు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

02

## నా చేతుల్లో ఏం లేదు..



- హైకమాండ్ హామీ నాకు తెలీదు
- రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై వెంకటరెడ్డి

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,02,220 |
| 22 క్యారెట్ | 93,700 |
| సిల్వర్ (కేజీ) | 1,15,000 |

# సీఎం రేవంత్ ఆధ్వర్యంలో ఢిల్లీలో బీసీ గర్జన

### పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

- బీసీ రిజర్వేషన్లకు ఎవరూ అడ్డుతగలొద్దు: పీసీసీ చీఫ్
- లోక్ సభలో గర్జించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు
- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్
- కులగణనతో దేశం చూపు తనవైపుకు తెలంగాణ సర్కార్
- ఇపుడు మహా ధర్నాతో బీసీ రిజర్వేషన్లపై సీఎం పోరు
- జంతర్ మంతర్ కు తరలిన కాంగ్రెస్ నేతలు..

హస్తినలో తెలంగాణ హల్ చల్

### జనహిత పాదయాత్ర టు ఢిల్లీ

జనహిత పాదయాత్రలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నాలుగురోజుల పాదయాత్ర తర్వాత చర్లపల్లి రైల్వేస్టేషన్ నుండి నేరుగా ఢిల్లీకి వచ్చారు. ఢిల్లో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఏర్పాట్లతో పాటు లోక్ సభలో పార్టీ ఎంపీల వాయిదా తీర్మానం, నిరసన కార్యక్రమాలు కూడా పరిశీలించారు.

### మంత్రులంతా ఢిల్లీ...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నమే ఢిల్లీకి చేరుకోగా, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, తదితరులంతా ఢిల్లీకి చేరుకున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున హస్తినబాట పట్టారు.



"తెలంగాణ నేతలతో ఢిల్లీ కొత్తకళ సంతరించుకుంది. బీసీ ఉద్యమాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జంతర్ మంతర్ సాక్షిగా మహాధర్నాకు పూనుకుంటున్నారు. బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్రమంత్రుల ఆధ్వర్యంలో ఈ ధర్నా జరగనుండగా, అన్ని ప్రాంతాల నుండి ఢిల్లీకి నేతలు తరలివెళ్ళారు. రైళ్ళు, విమానాలు ఢిల్లీకి వెళ్ళిన తెలంగాణ నేతలతో మంగళవారం కిటకిటలాడాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కేంద్రానికి తెలంగాణ పంపిన బిల్లును ఆమోదించాలని, 9వ షెడ్యూల్ లో చేర్చాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. కులగణన ద్వారా సామాజిక న్యాయం కాంగ్రెస్ కు మాత్రమే సాధ్యమని నిరూపణ అయిందని, ఇపుడు రాహుల్ ఆశయం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ కాంగ్రెస్ పోరుబాట పట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లు సాధించాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామని చెబుతున్నారు. గురువారం రాష్ట్రపతిని కూడా కలవనున్నారు. - ఢిల్లీ, మహా

02

# కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ అనుమతులేవు

### మంత్రివర్గ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం

- కంగారు పడొద్దు.. అన్ని వివరాలు అసెంబ్లీ ముందు పెడతాం
- కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగింది వాస్తవం
- చర్చ జరిగిన తర్వాతే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**ఖమ్మం, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు మరోసారి తీవ్రమయ్యాయి. ఈ ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కమిషన్ నివేదిక ద్వారా ప్రభుత్వానికి అందిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. కూసుమంచిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బీఆర్ఎస్ నేతలు కంగారు పడొద్దని.. అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు.

మిగతా 2లో

## కీలకంగా బండి స్టేట్ మెంట్



- 8న సిట్ ముందుకు కేంద్రమంత్రి
- దర్యాప్తును మలుపు తిప్పనున్న బండి సంజయ్ స్టేట్‌మెంట్
- జాతీయ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌పై చర్చ

02

## పేపర్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి

- ఈసీకి విజ్ఞప్తి చేసిన మాజీ మంత్రి కేటీఆర్
- అనేక దేశాలు నేటికి బ్యాలెట్ పద్ధతి ఫాలో అవుతున్నాయి
- ఈవీఎంలపై అనేక అనుమానాలున్నాయ్
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భేటీ



02

**స్టాక్ మార్కెట్**

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 80,710.25 |
| నిఫ్టీ | ↗ | 24,649.55 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

ఎన్ఈసీసీ గుడ్డు ధర


| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.35 | 130.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.35 | 130.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.61 | 138.33 |




### కార్తీకదీపం.. గుడిగంటలు.. బ్రహ్మముడి

# తర్వాత కాళేశ్వరమే

### టీవీలో వచ్చే సీరియల్ లా సీఎం రాజకీయం

మైక్ కట్ చేయకండి.. అసెంబ్లీలో చీల్చి చెండాడుతాం

సత్యహరిశ్చంద్రునికి తమ్ముడిలాగా ఉత్తమ్ కుమార్.. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది

తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**హైదరాబాద్, మహా:** టీవీల్లో వచ్చే కార్తీకదీపం గుడిగంటలు, బ్రహ్మముడి సీరియల్‌లా రోజుకో అంశంపైన రేవంత్ రెడ్డి రాజకీయం చేస్తున్నాడు. తెలంగాణలో రాజకీయ కక్ష సాధింపునకు రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని మాజీమంత్రి హరీష్ రావు ఆరోపించారు.

మిగతా 2లో

### ఫామ్‌హౌస్‌లో మామ డైరెక్షన్.. పార్టీ ఆఫీస్‌లో

## అల్లుడి యాక్షన్


- కేసీఆర్, హరీశ్ బండారం బట్టబయలైంది
- జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారు
- చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- కేసీఆర్, హరీశ్ రావుపై నిప్పులు చెరిగిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు 2లో

# వైరల్‌గా మారిన పాడిపంటలు

### సోషల్ మీడియాలో కాళేశ్వరంతో లింక్

సూపర్ స్టార్ కృష్ణ నటించిన సూపర్ హిట్ మూవీ




**హైదరాబాద్, మహా:** సోషల్ మీడియాలో ఒక్కసారిగా సూపర్ స్టార్ కృష్ణ నటించిన సూపర్ హిట్ మూవీ పాడిపంటలు వైరల్ గా మారింది. కాళేశ్వరం కథ కరప్షన్ పాడిపంటలు సినిమాలో ప్రాజెక్టు కట్టడం అవినీతితో పోలుస్తూ రెండు వీడియోలు చిత్రాలతో రూపొందించిన వీడియోలు వైరల్ గా మారాయి. కాళేశ్వరం రియల్ పాడిపంటలు రీల్ అంటూ కమిషన్ల కక్కుర్తి, నాసిరకం నిర్మాణం అంటూ సినిమాలో చాలా సన్నివేశాలను వివరిస్తూ రూపొందించిన వీడియో వైరల్ గా మారింది.

మిగతా 2లో

## కంది శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

### కాంగ్రెస్ శ్రేణులు అభిమానులతో సందడిగా ప్రజాసేవాభవన్

- నియోజకవర్గ నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజలు
- భారీ గజమాలతో కంది శ్రీనివాస రెడ్డికి సత్కారం.. 40 కిలోల కేక్ కట్ చేసి శుభాకాంక్షల వెల్లువ
- అభిమానంతో స్వచ్ఛందంగా రక్తదానం దానం చేసిన అభిమానులు
- జన్మదినం సందర్భంగా పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు

05



# నెంబర్ వన్ అమిత్ షా

**దేశ రాజకీయాల్లో అమిత్ షా తిరుగులేని రికార్డ్**
**ఎక్కువ కాలం కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు.. అద్వానీ రికార్డు బ్రేక్**



**ఢిల్లీ, మహా :** భారత రాజకీయాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన రికార్డు క్రియేట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా పని చేసిన రెండో నేతగా హిస్టరీ క్రియేట్ చేశారు. ఈ క్రమంలో ఇందిరాగాంధీని ఆయన అధిగమించారు. ఎక్కువ కాలం పని చేసిన భారత ప్రధానిగా మోదీ కంటే ముందు జవహర్ లాల్ నెహ్రూ ఉన్నారు. మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరో రికార్డ్ క్రియేట్ చేశారు. దేశ చరిత్రలో కేంద్ర హోంమంత్రిగా అత్యధికకాలం పని చేసిన రికార్డును అమిత్ షా సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. మోదీ 1.0 పాలనలో కేంద్ర హోంమంత్రిగా రాజ్ నాథ్ సింగ్ పని చేశారు. అమిత్ షా 6 సంవత్సరాల 64 రోజులుగా కేంద్ర హోం మంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2019లో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమిత్ షా కేంద్ర హోంమంత్రిగా కొనసాగుతున్నారు.

# రాజీనామాకు రెడీ

**అవసరమైతే మునుగోడుకు ఉప ఎన్నిక తెస్తా..**
**మంత్రి పదవి ఇస్తారా.. ఇవ్వరా అధిష్టానం ఇష్టం**
**వాటి కోసం కాళ్ళు పట్టుకునే నైజం నాది కాదు**
**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**యాదాద్రి భువనగిరి, మహా:** మళ్లీ ఏ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైన పోతా అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన స్టేట్మెంట్ ఇచ్చారు. సంస్థాన్ నారాయణపురంలో ఆయన మాట్లాడుతూ.. మునుగోడు ప్రజల కోసం ఎంత దూరమైనా ప్రయాణం చేస్తానన్నారు. 'ఎల్‌బీ నగర్ నుంచి పోటీ చేస్తే నాకు మంత్రి పదవి వచ్చేది. మునుగోడు ప్రజల కోసం నేను మంత్రి పదవి వదులుకున్నాను. నేను పార్టీలోకి వచ్చినప్పుడు మంత్రి పదవి ఇస్తానన్నారు. భువనగిరి ఎంపీ స్థానాన్ని గెలిపించినప్పుడు కూడా మంత్రి పదవి ఇస్తామన్నారు. మంత్రి పదవి వస్తే మునుగోడు ప్రజలకు మంచి జరుగుతుందని ప్రజల ఆలోచన. పదవులను అడ్డుపెట్టుకొని సంపాదించే వాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవి అడగట్లేదు' అంటూ ఆయన చెప్పుకొచ్చారు. నాలాంటి వాడికి మంత్రి పదవి వస్తే ఇంకా ఎంతో మంచి సేవా కార్యక్రమాలు చేస్తారని ప్రజలు నమ్ముతున్నారు. రాజగోపాల్‌రెడ్డికి ప్రజలు కావాలి. మంత్రి పదవి ఇస్తారా? ఇవ్వరా అది మీ ఇష్టం. నేను తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఉన్నాను. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్నాను. వేరే పార్టీ నుండి వచ్చిన వాళ్లకు పదవులు ఇచ్చారు. నాకన్నా చిన్నవారికి పదవులు ఇచ్చారు. మీరు ఎంపీ గెలిపించుకో అంటే గెలిపించాను. నేను ఎవరి కాళ్లు మొక్కి పదవి తెచ్చుకోవాలనుకోవట్లేదు. మనసు దిగజార్చుకొని బతకడం నాకు తెలియదు. మునుగోడు ప్రజలు తలదించుకునే పని ఏనాడు చేయను'' అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# సీఎం రేవంత్ ఆధ్వర్యంలో ఢిల్లీలో బీసీ గర్జన

**పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు**
**బీసీ రిజర్వేషన్లకు ఎవరూ అడ్డుతగలొద్దు: పీసీసీ చీఫ్**
**లోక్ సభలో గర్జించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు**
**బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్**
**కులగణనతో దేశం చూపు తనవైపుకు తెలంగాణ సర్కార్**
**ఇపుడు మహా ధర్నాతో బీసీ రిజర్వేషన్లపై సీఎం పోరు**
**జంతర్ మంతర్ కు తరలిన కాంగ్రెస్ నేతలు.. హస్తినలో తెలంగాణ హల్ చల్**

**ఢిల్లీ, మహా:** తెలంగాణ నేతలతో ఢిల్లీ కొత్తకళ సంతరించుకుంది. బీసీ ఉద్యమాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జంతర్ మంతర్ సాక్షిగా మహాధర్నాకు పూనుకుంటున్నారు. బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్రమంత్రుల ఆధ్వర్యంలో ఈ ధర్నా జరగనుండగా, అన్ని ప్రాంతాల నుండి ఢిల్లీకి నేతలు తరలివెళ్ళారు. రైళ్ళు, విమానాలు ఢిల్లీకి వెళ్ళిన తెలంగాణ నేతలతో మంగళవారం కిటకిటలాడాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కేంద్రానికి తెలంగాణ పంపిన బిల్లును ఆమోదించాలని, 9వ షెడ్యూల్ లో చేర్చాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. కులగణన ద్వారా సామాజిక న్యాయం కాంగ్రెస్ కు మాత్రమే సాధ్యమని నిరూపణ అయిందని, ఇపుడు రాహుల్ ఆశయం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ కాంగ్రెస్ పోరుబాట పట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లు సాధించాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామని చెబుతున్నారు. గురువారం రాష్ట్రపతిని కూడా కలవనున్నారు.



**ఎవరూ అడ్డుపడొద్దు- పీసీసీ చీఫ్ మహేష్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో పార్టీలకు అతీతంగా ధర్నా చేస్తున్నామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ తెలిపారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ధర్నాకు పిలుపునివ్వగా, మంగళవారం రాత్రి జంతర్ మంతర్లో ధర్నా ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇతర కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లులు ఆమోదం కోసం జంతర్ మంతర్‌లో ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ధర్నాకు బీజేపీ ఎంపీలు వస్తే ఆహ్వానిస్తామని.. పార్టీలకు అతీతంగా ఈ ధర్నా చేస్తున్నామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీ రిజర్వేషన్లకోసం పోరాడుతున్నామని.. బీసీ రిజర్వేషన్లకు ఎవరూ అడ్డుతగలొద్దని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో పాల్గొనేందుకు వేలాది మంది తెలంగాణ ప్రజలు ఢిల్లీ తరలి వస్తున్నారని.. ధర్నా విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


## కార్తీకదీపం.. గుడిగంటలు.. బ్రహ్మముడి

# తర్వాత కాళేశ్వరమే

**టీవీలో వచ్చే సీరియల్ లా సీఎం రాజకీయం**
**మైక్ కట్ చేయకండి.. అసెంబ్లీలో చీల్చి చెండాడుతాం**
**సత్యహరిశ్చంద్రునికి తమ్ముడిలాగా ఉత్తమ్ కుమార్.. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది**
**తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే రిపోర్టులు కోర్టు ముందు నిలబడవు, ఎప్పటికైనా ధర్మం గెలుస్తుందన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసింది. విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ రాక ఇంట్లోనే ఉంటున్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. కమీషన్ల పేరుతో పాలన నడుస్తుంది. రాష్ట్రం మొత్తం కమీషన్ల మయం చేశారు. రెండు పార్టీలు రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నాయి. ఎన్డీఎస్ఏ రిపోర్ట్ గురించి అందరికీ తెలుసు. పోలవరం ప్రాజెక్టు రెండు సార్లు కూలిపోతే ఎన్డీఎస్ఏ లేదు. మేడిగడ్డ బ్యారజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే ఆగమేఘాల మీద ఎన్డీఎస్ఏ రిపోర్ట్ వచ్చింది. కాళేశ్వరం కమిషన్ గడువు రాత్రికి రాత్రే పెంచారు. కేసీఆర్‌కు, హరీష్ రావుకు




నోటీసులు ఇచ్చారని మీడియాకే ముందు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ పూర్తి రిపోర్ట్ వస్తే బీఆర్ఎస్ ఎలా స్పందించాలో మాకు తెలుసు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పై చర్చ పెడితే ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ చీల్చి చెండాడుతుంది. ప్రభుత్వం బయటపెట్టిన రిపోర్టు చూస్తుంటే పూర్తిగా ఆధారాల్లేవు.

**టీవీల్లో వచ్చే సీరియల్‌లా..**

రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే రిపోర్టులు కోర్టు ముందు నిలబడవు, ఎప్పటికైనా ధర్మం గెలుస్తుంది. టీవీల్లో వచ్చే కార్తీకదీపం గుడిగంటలు, బ్రహ్మముడి సీరియల్‌లా రోజుకో అంశంపైన రేవంత్ రెడ్డి రాజకీయం చేస్తున్నాడు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నాయి. కన్నేపల్లి పంపు హౌస్ ద్వారా నీళ్ళు ఇచ్చే అవకాశం ఉన్నా.. నీళ్లను ఇవ్వడం లేదు. తుమ్మిడిహట్టి దగ్గర తట్టెడు పని కూడా కాంగ్రెస్ పార్టీ చేయలేదు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ గో బెల్స్ ప్రచారం చేస్తుంది. బేగంపేట ఎయిర్ పోర్టులో కేసీఆర్ సవాల్‌ను ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వీకరించలేక పారిపోయాడు. తుమ్మిడిహట్టి 152 మీటర్ల ఎత్తుకు ప్రాజెక్టు కట్టేందుకు అనుమతి ఉన్నదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తప్పుడు ప్రచారం చేశాడు' అంటూ వ్యాఖ్యలు చేశారు.

**సిగ్గు లేకుండా కమీషన్లు తీసుకున్నారు..**

ఉత్తమ్ నిన్న ఇంకో మాట మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు రూ. 11 వేల కోట్లు ఖర్చు పెట్టాం. రాష్ట్రం ఏర్పడే వరకు 32 శాతం ఖర్చు పెట్టినం అన్నాడు. ఆయన బిల్డప్ ఎట్ల ఉంటది అంటే.. సత్యహరిశ్చంద్రునికి తమ్ముడిలాగా బిల్డప్ ఇస్తాడు. సత్యహరిశ్చంద్రుడే దిగి వచ్చిండా..? అబ్బ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంత నిజాయితీగా మాట్లాడిండా..? అన్నట్టు ఉంటది. ఆయనకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు. 2014లో రాష్ట్రం ఏర్పడే నాటికి ప్రాణహిత చేవెళ్లలో పెట్టిన ఖర్చు కేవలం రూ. 3,700 కోట్లు మాత్రమే. నాట్ ఈవెన్ 10 పర్సెంట్. కానీ రూ. 11 వేల కోట్లు చేసిండు అంటడు. అబద్దాలకు కూడా హద్దులు ఉండాలి. ఉమ్మడి రాష్టంలో, ఢిల్లీలో, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా, ఆ నాటి కేబినెట్‌లో ఉత్తమ్ మంత్రిగా ఉన్న తమ్మిడిహట్టికి అనుమతులు తీసుకురాలేదు. సిగ్గు లేకుండా కమీషన్లు తీసుకున్నారు. రూ. 2300 కోట్లు జేబులు నింపుకుని ప్రజలకు అన్యాయం చేశారు. నాలుగేండ్లలో పూర్తి చేశామని చెప్పి తట్టెడు మట్టి తవ్వకుండా ఈ రాష్ట్రానికి అన్యాయం చేశారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.




**ఫామ్‌హౌస్‌లో మామ డైరెక్షన్..**

# పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్షన్

- కేసీఆర్, హరీశ్ బండారం బట్టబయలైంది
- జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారు
- చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- కేసీఆర్, హరీశ్ రావుపై నిప్పులు చెరిగిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం నివేదికతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల బండారం బట్టబయలైందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడిషియల్ కమిషన్ విచారణలో బయటపడిందని తెలిపారు. అందుకే తేలు కుట్టిన దొంగలా.. హరీశ్ రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ విమర్శించారు. హరీశ్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయని స్పష్టం చేశారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణలో కేసీఆర్ పాత్ర ఏమిటో.. హరీశ్ రావు చేసిన ఘన కార్యాలేమిటో తేలిపోయిందన్నారు. కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. అందుకే హరీశ్ రావు ఏకంగా జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారని విమర్శించారు. విచారణ కమిషన్ తేల్చిన విషయాలపైనా, ఇచ్చిన నివేదికపైన అసెంబ్లీలో చర్చిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నమ్మకం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. అందుకే.. కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఫార్మ్ హౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్షన్ అంటూ ఎద్దేవా చేశారు. హరీశ్ రావు అసెంబ్లీకి వచ్చి, చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ డిమాండ్ చేశారు.

# పేపర్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి

**ఈసీకి విజ్ఞప్తి చేసిన మాజీ మంత్రి కేటీఆర్**
**అనేక దేశాలు నేటికి బ్యాలెట్ పద్ధతి ఫాలో అవుతున్నాయి**
**ఈవీఎంలపై అనేక అనుమానాలున్నాయ్**
**కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భేటీ**



**ఢిల్లీ, మహా:** వచ్చే సాధారణ ఎన్నికల కల్లా దేశ వ్యాప్తంగా బ్యాలెట్ తోనే ఎన్నికలు నిర్వహించాలని ఈసీని కోరినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అనంతరం కేటీఆర్ విలేకర్లతో మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి పేపర్ బ్యాలెట్ తో ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే ఈవీఎంలపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. అదీకాక.. అనేక దేశాలు నేటికి బ్యాలెట్ విధానంతోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలపై బాండ్ పేపర్లతో ప్రజలను వంచించిందని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండక పోతే ప్రజలు శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఆయన సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఎన్నికైన ప్రజా ప్రతినిధుల సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక బీహార్ ప్రత్యేక ఓటరు సవరణపై కూడా ఈ సందర్భంగా చర్చించామన్నారు. ఓటర్లను ఉద్దేశ పూర్వకంగా తీసేయలేదని ఎన్నికల సంఘం తమకు స్పష్టం చేసిందని వివరించారు.

**ఆ కారణాలపై జాబితా తయారు చేయాలి..**

ఓటరు జాబితా సవరణ మంచిదే కానీ.. అందర్నీ విశ్వాసంలోకి తీసుకొని చేయాల్సి ఉందని మాజీ మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అన్ని పార్టీలను భాగస్వామ్యం చేసి పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేయాలన్నారు. బూత్ లెవల్ కమిటీలతో అఖిల పక్ష కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్లను ఎందుకు తీసేస్తున్నారానే కారణాలపై ఎన్నికల సంఘం జాబితా పెట్టాలన్నారు. దొంగ హామీలు, వాగ్దానాలతోపాటు అమలు చేయని హామీలపై సైతం ఈ సందర్భంగా ఈసీతో చర్చించామన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ అనుమతులేవు



(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు.

**అవినీతికి బాధ్యులైన వారిపై..**

పీసీ ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బీఆర్ఎస్ నేతలు జనంలోకి వస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బీఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని కామెంట్స్ చేశారు. ఈ అవినీతి నివేదికపై త్వరలోనే రాష్ట్ర అసెంబ్లీలో చర్చ జరుపుతామని తెలిపారు. చర్చ అనంతరం, ఈ అవినీతికి బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన ప్రస్తుత ప్రభుత్వానికి గత ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలను రుజువు చేసేందుకు ఒక అవకాశంగా నిలిచింది. ఈ చర్యలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తాయో చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత కొంతకాలంగా ఉన్న ఆరోపణలకు ఈ నివేదిక మరింత బలాన్ని చేకూర్చిందని చెప్పవచ్చు.

# కీలకంగా బండి స్టేట్ మెంట్

**8న సిట్ ముందుకు కేంద్రమంత్రి**
**దర్యాప్తును మలుపుతిప్పనున్న బండి సంజయ్ స్టేట్‌మెంట్**
**జాతీయ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ పై చర్చ**

**హైదరాబాద్, మహా:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగస్టు 8న సాక్షిగా వాంగ్మూలం ఇవ్వనున్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ముందు ఆయన హాజరవుతారు. గతంలో జూలై 28న తన వాంగ్మూలం నమోదు చేసుకోవాలని బండి సంజయ్ సిట్ అధికారులను కోరారు. అయితే పార్లమెంట్ సమావేశాల కారణంగా ఆయన హాజరు కాలేకపోయారు. బీజేపీ నేత బండి సంజయ్ ఈ కేసులో చాలా సాక్ష్యాలు సమర్పించే అవకాశం ఉందని ఆయన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫోన్ ట్యాపింగ్ వెనుక మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఉన్నారని ఆరోపించిన బండి సంజయ్, దర్యాప్తు అధికారులకు సహకరిస్తానని ఇంతకుముందే చెప్పారు.

**ఆయన వ్యక్తిగత సిబ్బంది కూడా..**

అదేరోజు సంజయ్‌తో పాటు సిట్ విచారణకు సంజయ్ వ్యక్తిగత సిబ్బంది కూడా హాజరవుతారు. బండి సంజయ్ విజ్ఞప్తితో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ పాత్రపై ఐబీ వర్గాలు ఆధారాలు సేకరిస్తున్నాయని చెబుతున్నారు. కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని సిట్ ఎదుట రాధాకిషన్ రావు అంగీకరించారు. డీజీపీ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రభాకర్ రావు వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్ ల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని భావిస్తున్నారు. ఈనెల 8న సిట్ ఎదుట బండి సంజయ్ ఇచ్చే వాంగ్మూలం కీలకం కానుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై జాతీయ స్థాయిలో చర్చపెట్టాలని భావిస్తున్నారు.

## వైరల్‌గా మారిన పాడిపంటలు

**సోషల్ మీడియాలో కాళేశ్వరంతో లింక్**
**సూపర్ స్టార్ కృష్ణ నటించిన సూపర్ హిట్ మూవీ**




(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గ ఆమోదం లేకుండా అంతా నా ఇష్టం అన్న చందంలో కేసీఆర్ వ్యవహరించారని, తమ స్వార్థం కోసం ప్రాజెక్టు కట్టినా ప్రజాప్రభుత్వం మీ పాపం బద్దలు చేస్తుంది అంటూ ఆ సినిమాలో చెబుతారు. ఇపుడు అదే తీరున రేవంత్ ప్రభుత్వం వచ్చిందని కాంగ్రెస్ అభిమానులు వీడియో క్లిప్ లు కట్ చేసి షేర్ చేస్తున్నారు. దాదాపు యాభై ఏళ్ళ క్రితం తీసిన ఈ సినిమాను ఇపుడు ప్రాజెక్టులకు అన్వయిస్తూ కాంగ్రెస్ సోషల్ వారియర్లు తమ ప్రతిభ చూపుతున్నారు.

# నా చేతుల్లో ఏం లేదు.. హైకమాండ్ హామీ నాకు తెలీదు

**రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై వెంకటరెడ్డి**



**ఢిల్లీ, మహా:** మునుగోడు ఎమ్మెల్యే, తన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..నా సోదరుడు రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చే, ఇప్పించే స్థాయిలో నేను లేను. నా చేతుల్లో ఏం లేదు. అంతా పార్టీ హైకమాండ్, రాష్ట్ర నాయకత్వమే చూసుకుంటుంది అని స్పష్టం చేశారు. పదవుల కేటాయింపుపై హైకమాండ్ సీఎం, పీసీసీ చీఫ్ నిర్ణయం తీసుకుంటుందని తేల్చి చెప్పారు. నేనే కాదు, ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోలేమని కుండబద్దలు కొట్టారు. కేబినెట్‌లో నేను ఒక సీనియర్ మంత్రిని మాత్రమేనని అన్నారు. ప్రస్తుత కేబినెట్‌లో నేను సీనియర్ మంత్రిని అయినా.. హైకమాండ్ నిర్ణయమే కీలకం అని వెంకట్ రెడ్డి అన్నారు. మంత్రి పదవి ఇస్తామని రాజగోపాల్ రెడ్డికి అధిష్టానం హామీ ఇచ్చిన విషయం తనకు తెలియదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# హైదరాబాద్-విజయవాడ నేషనల్ హైవేకు మహర్దశ

## గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ.. ఆరు వరుసలుగా ట్రిపుల్ ఆర్



**ఢిల్లీ, మహా:** హైదరాబాద్విజయవాడ నేషనల్ హైవేకు త్వరలోనే టెండర్లు పిలువనున్నట్లు రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై సుదీర్ఘంగా చర్చించారు. మల్కాపూర్ నుంచి విజయవాడ (అమరావతి) వరకు 4 వరుసల రహదారిని నిర్మించేందుకు జీఎంఆర్ తో చేసిన ఒప్పందాన్ని రద్దు చేశారని మంత్రి తెలిపారు. ఇపుడు నాలుగు వరుసల రహదారిని 6 వరుసలుగా నిర్మించాలని, అదనంగా సర్వీస్ రోడ్డును రెండు వరుసలకు పెంచాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. డెత్ రోడ్డుగా పిలిచే హైదరాబాద్విజయవాడ రహదారిపై జూలై 27 న జరిగిన ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు డీఎస్పీల మృతి చెందిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ప్రతి రోజు ప్రమాదాల వార్తలను వినడం, కొన్నిసార్లు ప్రత్యక్షంగా చూడటం బాధ కలిగిస్తుందని తన ఆవేదనను గడ్కరీకి తెలియజేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తిపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఆగష్టు 15న కేంద్రం నిర్వహించే ఫైనాన్స్ మీటింగ్ లో ఎన్.హెచ్65 విస్తరణను ఆమోదిస్తామని.. త్వరితగతిన అంచనాలు రూపొందించి పంపాలని కేంద్ర మంత్రి సూచించారు. వెంటనే టెండర్లు పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చారు.

**ట్రిపుల్ ఆర్ సిక్స్ లేన్**

సంగారెడ్డి టూ చౌటుప్పల్ వరకు రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ పూర్తి చేసిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తెచ్చారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. 4 వరుసలుగా నిర్మించాలనుకున్న రీజినల్ రింగ్ రోడ్డు ను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 6 వరుసలుగా నిర్మించేందుకు ఎస్టిమేషన్లు ఆధునీకరిస్తున్నామని, టెండర్లను సైతం అందుకు అనుగుణంగా ఫైనలైజ్ చేస్తమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు. రివైజ్డ్ ఎస్టిమేషన్ తో 3 నెలల్లో ఉత్తర భాగం పనులు మొదలు పెట్టాలని, అంతేకాకుండా ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం కూడా యుద్ధప్రతిపాదికన ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ఇండస్ట్రీయల్ కారిడార్ గా రూపుదిద్దుకొనున్న నేపథ్యంలో వేగంగా పనులు చేపడితే అనుకున్న వ్యయంలోనే భూసేకరణ పూర్తవుతుందని, ఆలస్యం జరిగితే భూసేకరణకు ధరలు పెరిగి ప్రాజెక్టుకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని సమగ్రంగా వివరించారు. మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తిపై సానుకూలంగా మంత్రి స్పందించారు.

**ఎల్ బీ నగర్ - మల్కాపూర్:**

చింతల్ కుంట చెక్ పోస్ట్ నుంచి హయత్ నగర్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు దాదాపు 5.5 కిలో మీటర్ల ప్రాంతాన్ని ఎలివేటెడ్ కారిడార్ గా నిర్మించడంతో పాటు నాగ్ పూర్ లో మాదిరిగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ గా నిర్మాణం చేపట్టాలని కోరారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే మంజూరీలు ఇస్తానని గడ్కరీ హామీ ఇచ్చారు. హైదరాబాద్-శ్రీశైలం రోడ్డ్ జాతీయ రహదారి(ఎన్ హెచ్ 765): హైదరాబాద్ శ్రీశైలం రహదారి లో టైగర్ రిజర్వ్ నుంచి వెళ్తున్న ప్రాంతాన్ని ఎలివేటెడ్ కారిడార్ గా గుర్తించాలని కోరారు. ఈ రహదారి ప్రాంతం ప్రస్తుతం 62 కిలోమీటర్లు ఉందని, ఎలివేటెడ్ కారిడార్ గా మార్చితే నాలుగు కిలోమీటర్లు తగ్గి 58 కిలోమీటర్ల అవుతుందని అన్నారు.

**హైదరాబాద్ – మన్నెగూడ :**

ఈ రహదారికి సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో ఉన్న అంశాన్ని త్వరగా పూర్తి చేసి కాంట్రాక్టర్ ను ఒప్పించి త్వరితగతిన పనులు పూర్తిచేయడానికి సహకరించాలని అన్నారు. ఇవే కాకుండా, సేతు బంధన్ మరియు సీఆర్ఐఎఫ్ (సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నుంచి ప్రపోజల్స్ ఫర్ శాంక్షన్ కు విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ ఫ్లైఓర్ పనులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నానని, వీటితో రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రహదారుల అందించేందుకు హ్యామ్ విధానంలో ఇప్పటికే రోడ్లను ఎంపిక చేశామని తెలిపారు. తెలంగాణలో జాతీయ రహదారులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నాని, అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. అన్ని అంశాలను త్వరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు. సమావేశంలో తెలంగాణ ఎంపీలు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ సీట్లలో స్థానికత అంశం

## సుప్రీం కోర్టులో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వ్



**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణలో విద్యార్థుల స్థానికత అంశంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు రాష్ట్రం వెలుపల చదివి ఉంటే స్థానికత వర్తించదన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు గతంలోనే హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పును సైతం వెలువరించింది. అసలు స్థానికత అంటే ఏమిటి? దీని పరిధిలోకి ఎవరు వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై ఉన్న నిబంధనలు, మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో స్పష్టంగా పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును పలువురు విద్యార్థులు సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలను వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంలో సీజేఐ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి రెండేళ్లు బయటకు వెళితే స్థానికత కోల్పోవడానికి అవకాశం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఈ నిబంధనల వల్ల విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని బీఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ స్థానిక కోటా అంశంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. ఇరు పక్షాల వాదనల అనంతరం సీజేఐ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

4 ఏళ్ల చదువు లేదా నివాసంతో స్థానికత వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. చదువు కోసం కోటా, దుబాయ్ వెళ్తే స్థానికత వర్తించదంటే ఎలాగన్న కోర్టు ప్రతి విద్యార్థి 371 డి ఆర్టికల్ తెలుసుకోవాలన్నట్లుగా వాదనలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. నిబంధనలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉన్నాయని అసోంలో ఏడేళ్ల నిబంధన ఉందని రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానానికి తెలిపింది. పేద, మధ్యతరగతి వారికి జరుగుతున్న ఉపయోగాన్ని పరిగణలోకి తీసుకోవాలని న్యాయవాది సింఘ్వీ పేర్కొన్నారు. ప్రభుత్వం జీవో 33ని తీసుకురావడంతోనే సమస్య : రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల లో ఇంటర్ చదువుకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రంలో చదివిన వారినే స్థానికులుగా పరిగణించేలా ప్రభుత్వం జీవో నెంబర్ 33ను తీసుకువచ్చింది. దీనిపై కొందరు బాధిత విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం స్థానికతకు సంబంధించిన నియమ నిబంధనలను కొత్తగా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు తాత్కాలికంగా కౌన్సెలింగ్ ప్రక్రియకు అనుమతించింది. కోర్టులో పిటిషన్ వేసిన 135 మంది వైద్య విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులను సైతం పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. సుప్రీంకోర్టు తీర్పుపై ప్రభుత్వం, న్యాయశాఖలు కలిసి సంయుక్తంగా సమీక్ష చేశాయి. న్యాయస్థానం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత వైద్య విద్యార్థులను కౌన్సెలింగ్‌కు అనుమతించింది. కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకు సంబంధించిన మెరిట్ జాబితాను ప్రత్యేకంగా మరోసారి విడుదల చేసింది.

అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 8,900 : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా, 4,090 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 15 శాతం సీట్లు ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తున్నారు. మిగిలిన సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకే కౌన్సెలింగ్‌లో కేటాయిస్తున్నారు. వీటికి అదనంగా రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల్లో మరో 4,810 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం కన్వీనర్ కోటా కింద భర్తీ అవుతుండగా, మిగిలినవి బీ, సీ కేటగిరీల కింద భర్తీ చేస్తున్నారు. మెడికల్ సీట్ల కేటాయింపులో ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.

# కాంగ్రెస్ ధర్నా జంతర్ మంతర్ లాంటిదే

## ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయడం అంతా బూటకం

### ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం?

### బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు ఫైర్




**పెద్దపల్లి, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఢిల్లీలో నేడు జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ చేపట్టదలచిన ధర్నా అంతా బూటకం.. నాటకమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని సాకు చూపి దానిని బీజేపీ ప్రభుత్వంపై నెట్టాలని కాంగ్రెస్ చూస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని బీసీలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసిన కాంగ్రెస్ అందులో నుంచి 10 శాతం ముస్లింలకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేయనున్న ధర్నా కూడా జంతర్ మంతర్ లాంటిదేనని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని ఆ పార్టీ అగ్ర నేత దివంగత రాజీవ్ గాంధీతో పాటు ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఎందుకు ఆలోచించలేకపోయారని పేర్కొన్నారు. దీనిని బట్టి ఆ పార్టీకి బీసీలపై ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందని ఆరోపించారు. కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు పదవుల్లో ఉండడం ఒక ఉదాహరణ అని చెప్పారు.

# కేంద్ర సర్వీసుల్లోకి ఐఏఎస్ అధికారిని అలుగు వర్షిణి


**హైదరాబాద్, మహా :** ఐఏఎస్ అధికారిని అలుగు వర్షిణి కేంద్ర సర్వీసుల్లోకి అడుగుపెడుతున్నారు. నాలుగు సంవత్సరాల పాటు ఆమె కేంద్ర సర్వీసుల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్రం నియమించిన పోస్టులో మూడు వారాల్లో జాయిన్ అవ్వాలని అలుగు వర్షిణికి ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆమె తెలంగాణ గురుకులాల సెక్రటరీగా, గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇంతలోనే కేంద్ర సర్వీసులకు వెళుతున్నారు.

# మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం

### పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు




**మేడ్చల్, మహా:** తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

- ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ 25 కు వాయిదా
- కేసు స్టేటస్ రిపోర్టును కోరిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 25కు వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదని..అతనిని అరెస్టు చేయరాదంటూ ఇచ్చిన ఆదేశాలు రద్దు చేయాలని సిట్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ పై ఓ వైపు విచారణ జరుగుతుండగానే మరోవైపు సిట్ అధికారులు విచారణ పేరుతో తనను వేధిస్తున్నారని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రభాకర్ రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ల విచారణలో భాగంగా స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సుప్రీంకోర్టు ధర్మాసనానికి నివేదించారు. స్టేటస్ రిపోర్టు దాఖలు చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ప్రభాకర్ రావుకు అరెస్టు నుంచి కల్పించిన మధ్యంతర ఉపశమనం కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది.

# బూతులు మాట్లాడటం లీడర్లకు ఫ్యాషనైంది

## గతంలో బూతులు మాట్లాడిన నాయకులు ఎవరూ గెలవలేదు

### మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**హైదరాబాద్, మహా:** మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. భాషవిషయంలో రాజకీయ నాయకులు మరింత హుందాగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందని, యూట్యూబ్ లాంటి మాధ్యమాల్లో కొంతమంది జర్నలిస్టులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. పత్రిక రంగంలో భాష చాలా ముఖ్యం అని ఆయన తెలిపారు. నాయకులు భాష వాడకంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీనియర్ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రచించిన "విలీనం విభజన మన ముఖ్యమంత్రులు" పుస్తకావిష్కరణ సభ మంగళవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సభకు మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్య నాయుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని నేటి యువత తప్పనిసరిగా చదవాలి. ఇందులో ప్రస్తావించిన ముఖ్యమంత్రుల పరిపాలన, వారి విజ్ఞానం, ఆచరణ శైలి తదితర అంశాలను తెలుసుకోవచ్చు. పత్రికలు సమాజానికి దర్పణం వంటివి. సమాజంలో జరుగుతున్న విషయాలను. ప్రజలకు సమగ్రంగా తెలియజేయడం పాత్రికేయుల బాధ్యత అని అన్నారు. అలాగే నా జీవితంలో రెండు సందర్భాల్లో కంటతడి పెట్టాను. ఒకసారి మా తల్లి గుర్తుకు వచ్చినప్పుడు, ఎందుకంటే నేను ఆమెను ఎప్పుడూ చూడలేదు.

## రెండు సందర్భాల్లో కంటతడి పెట్టా..

రెండోసారి నాకు రాజకీయాల్లో ఉండాలని లేని పరిస్థితుల్లో పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నన్ను ఉపరాష్ట్రపతిగా ప్రకటించినప్పుడు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నేను పార్టీ ఆఫీస్‌కు కూడా పోలేదు అని వెంకయ్య నాయుడు చెప్పారు. ఇనగంటి వెంకట్రావు తరం జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచారని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన "విలీనం - విభజన" పుస్తకం కేవలం పుస్తకమే కాదు, మంచి నవలల్లా ఆసక్తికరంగా ఉందని ప్రశంసించారు. వెంకయ్య నాయుడు బీజేపీ కేంద్ర అధ్యక్షులుగా పని చేయడం ఆయన ప్రతిభకు నిదర్శనం అని, ఆయన నిర్వహించిన అనేక పదవులకు ఆయన వన్నె తెచ్చినారని కొనియాడారు. అప్పటి అసెంబ్లీ సమావేశాల్లో దివంగత జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు వాగ్ధాటితో సభలో అందరి ప్రశంసలు పొందేవారని గుర్తు చేశారు.



# యూరియా సరఫరాలో తీవ్ర అంతరం

- రాష్ట్రానికి సరిపడే యూరియా సరఫరా చేయాలి
- కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లేఖ

**ఢిల్లీ, మహా:** రాష్ట్రానికి సరిపడే యూరియాను సరఫరా చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. 2025 ఖరీఫ్ సీజన్ కోసం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన మొత్తం యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు (ఎంఎంటీ), అయితే, ఏప్రిల్ నుంచి జూలై వరకు కేటాయించాల్సిన 6.60 ఎల్ఎంటీ లకు బదులుగా 4.36 ఎల్ఎంటీ యూరియా మాత్రమే సరఫరా చేశారు. దీని ఫలితంగా 2.24 ఎల్ఎంటీ కొరత ఏర్పడిందని అన్నారు. అంతేకాకుండా, ఆగస్టు నెలలో దాదాపు 3.50 ఎల్ఎంటీ అవసరం ఉండగా, కేవలం 1.70 ఎల్ఎంటీ మాత్రమే కేటాయించారని గుర్తు చేశారు. ఈ పరిస్థితి కారణంగా, రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపులు, సరఫరాలో తీవ్ర అంతరం ఉందని, పత్తి, మొక్కజొన్న, వరి వంటి పంటలు ఎక్కువగా ప్రభావితానికి గురవుతున్నాయని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే తమరిని కలిసి యూరియా కొరత వివరించారని తెలిపారు. పీక్ సీజన్‌లో యూరియా కొరత కారణంగా రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా రేవంత్ వివరించారని గుర్తుచేశారు. కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయకపోవడంతో తెలంగాణ మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల రైతులు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.

# ఆగస్టులో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది


- రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సప్లై చేయాలి
- రావాల్సిన 2.10 లక్షల మెట్రిక్ టన్నులను ఆగస్టు మాసంలో సరఫరా చేయాలి
- కేంద్రమంత్రి జేపీ నడ్డా లేఖకు ప్రతిస్పందనగా మంత్రి తుమ్మల లేఖ



**హైదరాబాద్, మహా :** ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో రైతుల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థలైన పీపీఎల్ నుండి 11,000 మెట్రిక్ టన్నులు మరియు ఎంసీఎఫ్ఎల్ నుండి 7,000 మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు రాసిన లేఖలో తుమ్మల నాగేశ్వరరావు కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పిన పీపీఎల్, ఎంసీఎఫ్ఎల్ వల్ల ఏర్పడిన 18,000 మెట్రిక్ టన్నుల కొరతను ఆర్ఎఫ్ సీఎల్ ద్వారా భర్తీ చేయాలని, ఆగస్టు నెలలో కేటాయించిన విధంగా రాష్ట్రానికి దిగుమతి ద్వారా అందాల్సిన 39,600 మెట్రిక్ టన్నుల యూరియాను ఈ నెల 20వ తేదీకి ముందు రాష్ట్రానికి చేరే నౌకల ద్వారా ఇవ్వాలని, దాంతో పాటు ఏప్రిల్ నుండి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని లేఖ ద్వారా అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగు అవుతున్న పంటలకు యూరియా లభ్యత నిరవధికంగా ఉండేలా చూసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ఎన్నికల వ్యవస్థపై దాడి చేస్తే ఏం లాభం?





- కృష్ణమూర్తి
అసోసియేట్ ఎడిటర్

ఆటలో పోరాడాల్సింది ప్రత్యర్థిపైనే కానీ అంపైర్లపై కాదు. అంపైర్లతో పోరాడితే పిచ్చి వాళ్లనుకుంటారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ పార్టీలు ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. తన ముఖం బాగాలేక అద్దం పగులకొట్టుకున్నట్లుగా ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను, ప్రజలు ఎందుకు తిరస్కరించారన్న అంశాలపై దృష్టి పెట్టి సరిదిద్దుకునే పని చేయాల్సిన పార్టీలు అసలు విషయాన్ని పక్కకు పెట్టి ఎన్నికల సంఘాన్ని తప్పు పడుతూ కాలం వెళ్ళదీసే ప్రక్రియకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఓడితే ఒక లెక్కా, గెలిస్తే మరో లెక్క అన్నట్లుగా పార్టీలు అనుసరిస్తున్న తీరును ప్రజలు కూడా తప్పుపట్టే పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ దేశ రాజకీయ ఆటలో బీజేపీతో కన్నా ఎన్నికల సంఘంతోనే ఎక్కువగా పొరాడుతోంది. బెదిరించేందుకు.. బ్లాక్ మెయిల్ చేసేందుకు ఆరోపణలు చేస్తోందన్న వాదన ప్రజల్లో రోజురోజుకూ బలపడుతోంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం బీజేపీ కూడా ఇదే తరహాలో ఈసీపై నెపం వేసి తమ పార్టీ ఓటమికి ఈసీయే కారణమని ప్రజలకు బూచీలా చూపారు, ప్రస్తుతం అదే తరహాలో కాంగ్రెస్ పార్టీ మిగతా పార్టీలు కూడా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా అవగతమవుతోంది.

### మొన్నటిదాకా ఈవీఎంలు.. ఇప్పుడు ఓటర్ల జాబితాలా ?

ఎన్నికల ఫలితాలు వచ్చిన ప్రతీ సారి ఈవీఎంలపై ఓడిపోయిన పార్టీలు ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. ఈవీఎంలు లేకపోతే తాము గెలిచే వారమని, ఈవీఎంల గోల్ మాల్ వల్లే తమకు ఓటమి ఎదురైందన్న వాదనలూ అన్ని పార్టీలు చేస్తున్నాయి. ఈవీఎంల నిర్వహణ వాటి ద్వారా ఓటింగ్ లో పారదర్శకత తదితర అంశాలపై అనేక సందర్భాలల ఈసీ పరాజకీయ పార్టీలకూ, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తిగతంగా అభ్యంతరాలను వ్యక్తం చేసే వారి అనుమానాలను నివృత్తి చేస్తూ వస్తోంది. అయినప్పటికీ ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఓడిపోయిన పార్టీలు ఈసీపైనే అభియోగం మోపడం సర్వసాధారణమైంది. ఈవీఎంలే లేకపోతే చాను గెలిచే వారమని, ప్రజలు తమకు ఓట్లేసినా ఈవీఎంల ద్వారా జరిగిన మాయాజాలంతో ఫలితాలు మారాయన్న అభియోగాలు ఎప్పటికప్పుడు చేస్తూనే ఉన్నారు. ఈవీఎంలపై ఎన్నో సార్లు పార్టీలూ, రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థలు కోర్టులకు కూడా వెళ్లారు. అయితే ఇప్పుడు వారంతా ఈవీఎంలపై కాకుండా ఓటర్ల జాబితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దొంగ ఓట్లను చేర్చి బీజేపీ గెలుస్తోందని వాదన జోరుగా వినిపిస్తోంది. తమ దగ్గర అణుబాంబుల్లాంటి సాక్ష్యాలున్నాయని చెబుతున్నారు. ఉంటే బయట పెట్టడానికి ఇంత కన్నా గొప్ప సమయం ఏమి ఉంటుందని వస్తున్న ప్రశ్నలకు మాత్రం సౌండ్ ఉండటం లేదు.

### బీహార్‌లో ఆరోపణలు

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేసి ఆగస్టు ఒకటో తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించారు. అయితే తమ ఓటు గల్లంతయ్యాయని ఫిర్యాదు చేస్తున్న వారు దాదాపుగా లేరు. అయితే తన ఓటు పోయిందని తేజస్వి యాదవ్ ఆరోపించారు. కానీ అది ఫేక్ ఓటు. ఈసీ జారీ చేసింది కాదు. ఆయన ఓటు వేరే ఉంది. అది ఆయనకూ తెలుసు. గత ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు తన అసలు ఓటునే అఫిడవిట్ లో పెట్టారు. మరీ తాను మీడియా సమావేశంలో చూపించిన రెండో ఫేక్ ఓటు ఎక్కడి నుంచి వచ్చింది. ఇలాంటి ఫేకుల్ని ఏరి పారేయడానికే ఈసీ ఎస్ఐఆర్ ని తెచ్చింది. దాన్ని తప్పు పట్టి ఏం సాధించాలనుకుంటున్నారో సదరు పార్టీకే తెలియాల్సిన అవసరం ఉంది. అయితే సదరు పార్టీ నేత మాత్రం తానేదో ఘన కార్యం చేశానని, ఈసీని ఇరకాటంలో పెట్టానని అనుకుంటున్నప్పటికీ ప్రజలు మాత్రం ఆయన ప్రకటనను జోక్ గా తీసుకుంటున్నారు. పార్టీలూ, నేతలు చేస్తున్న పస లేని ఆరోపణల కారణంగా ఈసీపై ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరుగుతుంది తప్ప ఏ మాత్రం తగ్గడం లేదు. ఈసీపై విశ్వసనీయత పెరుగుతున్న నేపథ్యంలో ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలు నమ్ముతున్నారన్న విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఉంది.

### గతంలో బీఆర్ఎస్ కూడా.....

తెలంగాణ రాష్ట్రాన్ని దాదాపు 10 ఏళ్ళ పాటు పాలించిన బీఆర్ఎస్ తాను అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలంటే డబ్బులు అన్నట్లుగా మార్చింది. ఏ ఎన్నికలు వచ్చినా డబ్బులతో ప్రజలను మభ్యపెట్టడం మామూలే అన్నట్లుగా వ్యవహరించింది. 2023 ఎన్నికల్లో ప్రజా తిరస్కరణకు గురవడంతోనే మరోసారి ఈసీని టార్గెట్ చేసింది. ఈవీఎంసలైప అనుమానాలున్నాయంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మొదలు పెట్టింది. లోక్ సభ ఎన్నికల్లో ఫలితాలు బీఆర్ఎస్ కు పూర్తి నిరాశను మిగిల్చాయి అసెంబ్ ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకుని కొంత సర్దుబాటుకు దిగి ఉంటే బాగుండేది కానీ, ఐయాం సుప్రీం, ఐయాం ఆల్ అన్నట్లుగా పార్టీ నాయకత్వం వ్యవహరించడం ప్రజలు పూర్తి స్థాయిలో చీత్కరించారు. ప్రజా నాడిని పసిగట్టడంలో విఫలమైన నాయకత్వం తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఈసీని టార్గెట్ చేసింది. ఈవీఎంలలో గోల్ మాల్ జరిగిందని సన్నాయి నొక్కులు నొక్కుతూ ప్రజా తీర్పును అవహేళన చేసింది. ఒక్క బీఆర్ఎస్సే కాదు లోక్ సభ ఎన్నికల్లో ఓటమి పాలైన అన్ని పార్టీలూ ఇదే పంథాను అనుసరించాయి. గెలిస్తే మేం, మా పార్టీ ఘనత, కార్యకర్తల బలం ఇలా చెప్పుకునే పార్టీలు ఓడితే మాత్రం ఈవీఎంలు, ఈసీయే కారణమని మాట్లాడటం ఆపేస్తే బాగుంటుందన్నది సాధారణ ప్రజల అభీష్టమన్న విషయాన్ని తెలుసుకుంటే బాగుంటుంది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బ్యాలట్ ద్వారానే ఎన్నికలు జరపాలన్న నిర్ణయానికి వచ్చారంటే ఆ పార్టీ కూడా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని నమ్ముతుంది. ఇంతకాలం ప్రజాస్వామ్యాన్ని, మొత్తం ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేసిన వారు ఈసీని అనుమానించడం కొంత ఆస్చర్యాన్ని కలిగిస్తుంది.


### ఇది కరెక్టేనా?

ఎన్నికల నిర్వహణ అంశంలో ఎన్నికల సంఘంపై విమర్శలు చేయవచ్చు. కానీ ఆ విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి. ఆధారాలతో ఉండాలి. ఓ సారి ఈవీఎంలను నిందిస్తారు. మరోసారి అదనపు ఓటర్లను చేర్చారని అంటారు. మరోసారి ఫేక్ ఓటర్లు, చనిపోయిన వారు ఓట్లు వినియోగించుకున్నారని అంటారు. వాస్తవానికి దేశంలో ఎన్నికల వ్యవస్థ క్రమక్రమంగా పటిష్టంగా మారుతోంది. ఓటు వేసే ప్రతి ఓటర్‌ను ఏజెంట్లు చెక్ చేసుకుంటారు. అంతేకాకుండా ఎన్నికల ప్రక్రియ ఆసాంతం కూడా నిఘా నేత్రాల మధ్య కొనసాగిస్తారు. ఎకక్డా ఏ చిన్న పొరపాటు జరగకుండా అంచలంచల పర్యవేక్షమ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకులకు, పార్టీలకు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎప్పుడు ఏ చిన్న అనుమానం కలిగినా క్షణాలలో నివృత్తి చేస్తారు. ఎన్నికల ప్రక్రియ ఒక్కరి చేతిలో ఉండదు. లక్షల మంది పాల్గొంటూ ఉంటారు. ఎన్నికల సంఘాన్ని తప్పు పట్టి రాజకీయం చేయడం ద్వారా కాంగ్రెస్ కు లాభమేం ఉండదు.. తప్పులు చేస్తే ప్రజల ముందు పెడితేనే ప్రయోజనం ఉంటుంది. దేశానికి ప్రజాస్వామ్యం ఎంత ముఖ్యమో, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం ఎన్నికల సంఘం కర్తవ్యం. అలాంటి సంస్థ ఏ ఒక్క పార్టీకో, వ్యక్తికో లాభం చేకూర్చేదిగా ఉంటుందనడం ప్రజాస్వామ్యంపై నమ్మకం కోల్పోవడం లాంటిదే.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# గద్దర్ వాగ్గేయ గురువు లచ్చుమమ్మ

గద్దర్ అనే మారుపేరుతో ప్రాచుర్యం పొందిన గుమ్మడి విఠల్ రావు అనే ఒక సామాన్యమైన మానవుడు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని అంటరాని దళిత కుటుంబంలో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య అనే దంపతులకు ఐదవ సంతానంగా 1948, జనవరి 31 నాడు జన్మించారు. ఆయన కుటుంబ సభ్యులలో అందరికన్నా చిన్నవారు. తల్లి లచ్చుమమ్మ తూప్రాన్ తాలూకా మూసాయిపేట గ్రామానికి చెందిన వారు. గుమ్మడి విఠల్ చిన్ననాటి నుండి తండ్రి కన్నా ఎక్కువగా తల్లిని అనుసరించేవారు. గుమ్మడి విఠల్ రావు తల్లి లచ్చుమమ్మ సగటు పల్లెటూరి మహిళ. ఆమె పేద దళిత మహిళగా జీవితాన్ని గడిపారు. ఆమె ఊరిలోనే ఉంటూ వ్యవసాయ కూలీగా జీవనాన్ని సాగించారు. ఆమెకు చిన్న కొడుకు విఠల్ మీద అమితమైన ప్రేమ కలదు. ఒక రకంగా తల్లి ప్రేమలో చిగురించారు విఠల్. ఈ రకంగా అందరికన్నా చిన్నవాడైన విఠల్ రావు తన తల్లి దగ్గరే ఎక్కువగా గడిపారు. అందువలన ఆయన పాటలు, సాహిత్యం మరియు ఆలోచనా విధానం అంతా తల్లి నేపథ్యంతోనే ముడిపడి ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే విఠల్ రావు ఆరోయేట వచ్చే వరకు తల్లి లోకంగా ఆడుతూ పాడుతూ అలసటే లేకుండా ఆహ్లాదంగా జీవించారు. గుమ్మడి విఠల్ రావు వాగ్గేయ గురువు తల్లి లచ్చుమమ్మ. ఆయన తల్లి లచ్చుమమ్మతో అత్యధిక ప్రేమానురాగాలు కలిగి ఉండేవారు. లచ్చుమమ్మ కంఠస్వరం చాలా శ్రావ్యంగా ఉండేది. ఆమె మట్టి వాసనలు గుబాలించే పల్లె పాటలు మరియు జానపద పాటలు చాలా బాగా రాగయుక్తంగా పాడేవారు. ఆ పాటలను విఠల్ రావు శ్రద్ధగా వింటూ తల్లిని అనుకరించేవారు. ఆ తల్లి విఠల్ రావుకి ప్రేమను మరియు పాటలను రంగరించి పోశారు. ఆ రకంగా తల్లి ప్రభావంతో విఠల్ రావుకి బాల్యంలోనే జానపద పాటలు మరియు వాటి బాణీలు బాగా వంటబట్టాయి. విఠల్ రావు తన తల్లి దగ్గరే జానపద పాటలు నేర్చుకొని పాడేవారు. పాఠశాలకు సెలవులు ఉన్న రోజుల్లో విఠల్ రావు తల్లితో పాటు కూలీ పనులకు వెళ్తూ శ్రమలోని బాధను మరియు ఆనందాన్ని చిన్నతనంలోనే అనుభవించారు. ఆయన ఆయా పనుల్లో ఉండే పని పాటలను విని గొంతెత్తి రాగయుక్తంగా పాడేవారు.



గుమ్మడి విఠల్ రావు సూక్ష్మగ్రాహి. ప్రతి విషయాన్ని చాలా తేలికగాను గ్రహించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉండేవారు. ఆయన చిన్నప్పుడు చదువుకుంటూనే తల్లితో పాటు కూలీ పనులకు వెళ్లేవారు. అక్కడ కూలీలు పాడే పాటలు వినేవారు. ఆయన ఆ పాటలను బడిలోనూ, ఊరిలోనూ పాడేవారు. అలా పాటలు పాడడం ద్వారా విఠల్ రావు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా పరిచయమయ్యారు. విఠల్రా వు తల్లి నుండి పాటలను మాత్రమే కాదు మానవత్వాన్ని కూడా పుణికిపుచ్చుకున్నారు. విఠల్ రావు చిన్ననాటి జీవితాన్ని పరిశీలిస్తే తల్లితో పాటు పొలంలో పిడకలు ఏరేవారు మరియు పేడ తట్టలు మోసేవారు. విఠల్ పేడ తట్టలు మోస్తున్నప్పుడు తన చుట్టూ ఉండే కష్టజీవులని చూసి వారు ఆలపించిన పాటలను ఆయన తన 'బుద్దర్ ఖాన్ వేషంలో అత్యద్భుతంగా ప్రదర్శించారు. విఠల్రా వు తల్లితో పాటు కూలీ పనులకు వెళ్తూ ఒకపక్క శ్రమలోని ఆనందాన్ని, మరోపక్క బాధలను చిన్నతనం లోనే అనుభవించారు. ఆయా పనులలో వ్యక్తమయ్యే పాటలను శ్రద్ధగా ఆలకించి క్రమంగా గొంతెత్తి పాడేవారు. ఆయన పాటలను ప్రజలు చాలా ఇష్టంగా ఆదరించేవారు. ఆయన భజన పాటలు, తత్వ పాటలు మరియు చిరుతల రామాయణం పాటలు పాడారు. అంతిమంగా విఠల్ రావు తల్లి నుండి కష్టించే తత్వం మరియు మానవత్వం లను పుణికిపుచ్చుకొని సమాజ దార్శనికతలను అలవరచుకుని తన బతుకును సమున్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఆయన నిత్య కృషీవలుడిలా గొప్ప త్యాగపూరిత జీవితాన్ని గడిపి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. తల్లి లచ్చుమమ్మ గద్దర్ పాటలకు పల్లవిగా నిలిచారు. దాదాపుగా ఆయన రాసిన పాటలన్నింటికి ఆమె బాణీలు మరియు భావాలు అందించారు. ముఖ్యంగా గద్దర్ పాటలు నక్సల్బరీ తరం నుండి పుట్టుకువచ్చాయి. ఆయన ముఖ్యంగా రాయడం కన్నా తన నోటి నుండి వచ్చే ప్రతి మాటని పాటగా మలచుకున్నారు. సిరిమల్లె చెట్టుకింద లచ్చుమామ్మో లచ్చుమమ్మ / సినబోయి కూర్చున్నావెందుకమ్మా ఎందుకమ్మా అనే పాటలో గద్దర్ తన తల్లి లచ్చుమమ్మని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన ఈ పాటలో తల్లి లచ్చిమమ్మని విప్లవోద్యమం వైపు సార్వజనీనం చేస్తూ పీడిత ప్రజానీకం ఎర్రదండులో చేరి సకల సమస్యలను పరిష్కరించుకోవాలిఅని నిర్దేశించారు. ఏడిస్తే ఏమి సాధించలేవు అని, ఎర్రదండులో చేరి మీ సాటి చెల్లెళ్లతో కలిసి మీ కొడుకును కలిసి పీడిత ప్రజల విముక్తికి పోరాటం చేయాలి అని ఆయన ప్రాగుక్తీకరించారు. నిజానికి గద్దర్ ఈ పాటని రాసిన కాలానికి అసలు ఎర్రదండు లేదు. కాని ఆయన ఊహాచిత్రాన్ని ఆ విధంగా అత్యద్భుతంగా అవిష్కరించడంలో ఆయనకు మరెవ్వరూ సాటిరారు. ఈ రకంగా ఆయన తల్లి లచ్చుమమ్మ వాగ్గేయ గురువుగాను విశిష్ట పాత్రను పోషించి అంతిమంగా గద్దర్ ని 'ప్రజా గాయకుడు' గాను తీర్చిదిద్దారు అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

**( ఆగస్టు 6 గద్దర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా... )**



- జె.జె.సి.పి. బాబూరావు,
రీసెర్చ్ స్కాలర్, 94933 19690





# ఘనంగా కంది శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు వేడుకలు

## కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులతో సందడిగా ప్రజాసేవాభవన్

నియోజకవర్గ నలుమూలలనుండి తరలివచ్చిన ప్రజలు

భారీ గజమాలతో కంది శ్రీనివాస రెడ్డికి సత్కారం



40 కిలోల కేక్ కట్ చేసి శుభాకాంక్షల వెల్లువ

అభిమానంతో స్వచ్ఛందంగా రక్తదానం దానం చేసిన అభిమానులు

జన్మదినం సందర్భంగా పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు



**ఆదిలాబాద్ మహా :** తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటానని జనం ఆశీస్సులతోనే ఇంతటి అభిమానాన్ని పొందగలిగాగని ఆదిలాబాద్ ముద్దబిడ్డ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం తన పుట్టిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గ నలుమూలలనుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషుల మధ్య ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవాభవన్ లో జరిగిన జన్మదిన వేడుకలలో ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి సమేతంగా పాల్గొని అందరి శుభాకాంక్షల వెల్లువల మధ్య భారీ కేక్ కట్ చేసారు. అంతకు ముందు అభిమానులు క్యాంపు కార్యాలయ ఆవరణలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. అశేషంగా తరలివచ్చిన శ్రేణులు పూలబొకేలు శాలువాలతో తమ అభిమాన నేత కంది శ్రీనివాస రెడ్డి దంపతులను సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టిన రోజుకు తనపై అభిమానంతో ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు , అభిమానులకు కంది శ్రీనివాస రెడ్డి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన జన్మదినాన్ని సేవాదినంగా పాటించి పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతో ఇంత మంది ప్రజల అభిమానాన్ని సంపాదించడం తనకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. ఆను ఓడినా గెలిచినా ప్రజల మనిషినే అన్నారు. నియోజక వర్గ ప్రజలకు ఎవరికి ఎలాంటి అవసరమొచ్చిన నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. మనమంతా ఓ కుటుంబంలా కలిసి మెలసి అనుకున్న లక్ష్యాలను చేరుకుందామన్నారు. నాయకులు కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక ఎన్నికలలో అంతా కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. తాను ఎల్లప్పుడూ మీ మనిషినే అని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎల్లకాలం ఇలాంటి ఆశీర్వాదం తనపై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించి వారికి ఫౌండేషన్ తరపున ప్రశంసా పత్రాలు అందచేసారు. అనంతరం రిమ్స్ ఆవరణలోని గణేష్ మందిరాన్ని కంది శ్రీనివాస రెడ్డి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేసారు. రిమ్స్ సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రంలో ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో ఆయన అభిమానులు చేపట్టిన అన్నదానకేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డికి లడ్డూల తులాభారం

**ఆదిలాబాద్ మహా :** తమ అభిమాన నేత పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి అభిమానులు క్యాంపు కార్యాలయ ఆవరణలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. అశేషంగా తరలివచ్చిన శ్రేణులు పూలబొకేలు శాలువాలతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే ఆవరణలో అభిమానులు లడ్డూలతో కంది శ్రీనివాస రెడ్డి కి తులాభారం నిర్వహించారు.

## ఆలయంలో కంది శ్రీనివాస రెడ్డి దంపతుల పూజలు

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళ వారం రిమ్స్ ఆవరణలోని గణేష్ మందిరాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అందరూ సుభిక్షంగా ఉండాలని పాడిపంటలతో వర్ధిల్లాలని ప్రార్ధించారు. అనంతరం తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి రిమ్స్ సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రాన్ని సందర్శించారు. పుట్టిన రోజు సందర్భంగా అక్కడ అన్నదానం నిర్వహించారు.

## సంస్థ అభివృద్ధికి సహకారం అందిస్తా.. కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలోని మదర్సాలో ఆయన అభిమానులు చేపట్టిన అన్నదానకేంద్రాన్ని ఆయన తన సతీమణి తో కలిసి సందర్శించారు. మదర్సా అభివృద్ధి కోసం ఎప్పుడు ఎలాంటి సహకారం కావాలన్న తాను అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

## వృద్ధాశ్రమంలో బిస్కెట్ ప్యాకెట్లు పండ్లు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలో పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. తన జన్మదినం సేవా దినంగా పాటిస్తున్నానన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని కేఆర్కే కాలనీలో గల వృద్ధాశ్రమాన్ని కంది శ్రీనివాస రెడ్డి దంపతులు సందర్శించారు.వృద్ధులకు పండ్లు , బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసారు.తనకు తన కుటుంబానికి మీలాంటి పెద్దల ఆశీర్వాదం కావాలన్నారు.





# విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వమే కొనసాగించాలి

### ఈనెల 12వ తేదీన జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

### ఏఐఎఫ్ డిఎస్, ఏఐఎఫ్ డివై

**హన్మకొండ మహా;** విద్యారంగాన్ని, వైద్య రంగాన్నీ ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ ఐ ఎఫ్ డి వై రాష్ట్ర అధ్యక్షులు కర్ర రాజిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 12వ తేదీన హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ ఐ ఎఫ్ డి వై రాష్ట్ర అధ్యక్షులు కర్ర రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధులు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ గారి శతజయంతి వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 12వ తేదీన హనుమకొండ ప్రెస్ క్లబ్ లో విద్యార్థి సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండాలని ప్రైవేటు రంగంలో ఉండకూడదని రాజ్యాంగం కల్పించిన విద్యా వైద్యం హక్కులను ప్రభుత్వాలు పేద చెవిన పెడుతున్నాయని వారు అన్నారు. ప్రభుత్వాలు నేటికీ కూడా కార్పొరేట్ విద్యా వైద్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్య వైద్య రంగాల పై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని వారు అన్నారు. చివరికి మంత్రులు ముఖ్యమంత్రులే ఈ కార్పొరేట్ విద్య, వైద్య కళాశాలలకు ప్రారంభం చేస్తున్నారు అంటే ఏ మేరకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను గౌరవించడం జరుగుతుందని నేటి విద్యార్థి యువత ఆలోచించాలని వారు విద్యార్థి యువజన లోకానికి పిలుపునిచ్చారు. తక్షణమే విద్య వైద్య రంగాలను ప్రభుత్వ రంగాలలో కొనసాగించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి హనుమకొండ జిల్లా కార్యదర్శి నీల రవీందర్ యువజన విద్యార్థి నాయకులు పరిమళ గోవర్ధన్ ఐతమ్ నగేష్ పోలబోయిన రాజు గాదె ప్రణయ్, కునుర్ రాజేందర్, కర్ర సీతారాం రెడ్డి, చీపురు ఓధయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

### కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు చీమల బిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి బిజెపి ప్రతి గడప గడపకి బూత్ అధ్యక్షుడు" 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొని గ్రామీణ వికాసం బిజెపితోనే సాధ్యం అనే నినాదంతో గడప గడపకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మార్పురాలే, బతుకులు మారలే అని, కాంగ్రెస్, బిఆరెస్ దొందూ దొందే అని, అవినీతికి కంచుకోట కాంగ్రెస్, అవినీతిపై కట్టిన కోట బీఆరెస్, స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసిన కాంగ్రెస్. తమ పదవికాలం ముగిసినా, ఇంకా పెండింగ్ బిల్లులు కోసం నిరీక్షిస్తున్న సర్పంచులు. కాంగ్రెస్ నాయకుల అనుచరులకే ఇందిరమ్మ ఇళ్ళు. విద్యుత్ కోతలు, అసంపూర్ణ ధాన్య సేకరణ, కౌలు రైతు భరోసా లేకపోవడం అన్నదాతలకు 2500/ ఆర్థిక సాయం, ఉచిత స్కూటీలు, కళ్యాణ లక్ష్మి తులం బంగారం కోసం ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధిని గాలికొదిలేసిందని గంట రవి మండిపడ్డారు. సాగు చేసే రైతు బాగు కోరుతూ 31.2 లక్షల మందికి పెట్టుబడి సాయం అంధిచింది బిజెపి అన్నదాత పై ఎరువుల భారం తీరుస్తూ 40,000/ కోట్ల సబ్సిడీలు అందించిందని పండించిన ప్రతి గింజను కొంటూ వరి ధాన్య సేకరణపై 11ఏళ్లలో రూ 1.5 లక్షల కోట్లు వెచ్చించింది బిజెపి యే అని అంతేకాకుండా అంత్యోదయ లక్ష్యంతో 5.67 లక్షల కుటుంబాలకు చెందిన 1.9 కోట్ల మంది లబ్దిదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేసి అందరి ఆకలి తీర్చి గ్రామీణ జీవనోపాధి మెరుగుపర్చడం కోసం 56 లక్షల మందికి పని కల్పించి 22,000/ కోట్లు వెచ్చించిందన్నారు అంకితభావం ఉన్న నాయకులు రావాలని చిత్తశుద్ధితో పని చేయగలిగే ఇలాంటి లక్షణాలు ఉన్న వారినే ఎంపిక చేసి బిజెపి బలపరుస్తోంది. బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, మీ గ్రామం అభివృద్ధికి తొడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పట్టపురం ఏకాంతం గౌడ్, మండల ప్రభారి రేసు శ్రీనివాస్ మరియు మండల ప్రధాన కార్యదర్శి జాటోత్ రవి, ఉపాధ్యక్షులు గోనె సంపత్, కిసాన్ మోర్చా అధ్యక్షులు చీమల చంద్రయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు గొల్లపల్లి సంతోష్, మండల ఉపాధ్యక్షులు పాయలి యాకయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బాదావత్ మారుతి, బూత్ అధ్యక్షులు నవీన్, భాస్కర్.వెంకన్న. కుమారస్వామి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు తాటికాల నరసయ్య, సీనియర్ నాయకులు భోగ సుధాకర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ ఘటన పునరావృతం కాకుండా చర్యలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.. కేజీబీవీలో వంట మనుషుల సస్పెన్షన్

### మండల ప్రత్యేక అధికారికి షోకాజు నోటీసు



**భూపాలపల్లి,మహా :** భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని కొరికించాల కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ ఘటన జిల్లాలో ఎక్కడ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. విద్యార్థుల సంక్షేమంలో అలసత్వాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం మొగుళ్లపల్లి మండలం కొర్కెశాలలోని కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.సోమవారం పురుగుపడిన అల్పాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై కలెక్టర్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు వంటవాళ్లను సస్పెండ్ చేశారు. కొత్తగా నియమితులైన వంటవాళ్లతో ముఖాముఖి మాట్లాడి మంచిగా వంట చేయాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని నాణ్యతకు కట్టుబడాలని, పాడైన బియ్యం, సరుకులు వినియోగించొద్దని స్పష్టం చేశారు. జిల్లాలోని 62 సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు వారి సమస్యలను తెలియచేయడానికి వీలుగా ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదుల బాక్స్ కు తాళం వేయాలని విద్యార్థులు తమ సమస్యలను ఆ పెట్టెల్లో స్వేచ్ఛగా వ్రాసి వేయాలని, ప్రతి వారం వాటిని తెరచి సమస్యలు గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే విద్యా శాఖ కార్యాలయంలో 9949194492, 9000996933, 9441924901 కంట్రోల్ రూము నంబర్లు ఏర్పాటు చేయాలని ఈ నంబర్లకు నేరుగా కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. అందిన సమాచారం గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అల్పాహారంలో పురుగుపడిన ఘటనపై ఎస్ ఓ కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈఓకు సూచించారు. 8, 9, 10వ తరగతులను పరిశీలించి విద్యార్థులతో ఆహార నాణ్యత అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాఠాలు చదివించి వారి ప్రతిభను అభినందించారు. ఇంకా మెరుగయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థిని పూజశ్రీ భవిష్యత్తులో తాను ఐపీఎస్ అధికారిని కావాలన్న ఆకాంక్షను వెల్లడించగా, కలెక్టర్ అభినందిస్తూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదవాలని, అపుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ప్రోత్సహించారు. అంతకు ముందు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో విడివిడిగా సమావేశం నిర్వహించి మీ పిల్లలు బాగా చదుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక అధికారులు ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. ప్రతి హాస్టల్ లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫుడ్ కమిటీ ఏర్పాటు చేశామని, ఆహార నాణ్యతను పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యే వరకు ఆరోగ్య శిబిరం కొనసాగాలని అన్నారు. ఆరోగ్య శిబిరం లో అత్యవసర మందులు పరిశీలించారు. ఇంటికి వెళ్లిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నివాకబు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఇంఛార్జి వైద్యాధికారి డా శ్రీదేవి, తహసీల్దార్ సునీతా, ఎంపిడిఓ సురేందర్ తదితరులు. పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం పెంచాలి..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు, వేగం పాటించి పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, స్థానిక నాయకులకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిత్యం పట్టణంలోని వార్డుల్లో ప్రజలతో మమేకమై ఆయా కాలనీలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 11, 12, 13,14 వార్డుల్లో స్థానిక నేతలైన బాబర్ ఖాన్, అందె మోహన్, ముబారక్, జమ్రుద్ ఖాన్ తదితరులతో కలిసి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా స్థానిక మహిళలు డ్రైనేజీ, తాగునీటి తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని స్థానిక నేతలకు సూచించారు. అనంతరం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... షాద్ నగర్ మున్సిపాలిటీ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంతర్గత రహదారులు, మంచినీటి సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, లోఓల్టేజ్ కరెంటు సమస్యలు వంటి అంశాల పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. సమస్యలు ఏమున్నాయని ప్రజలనే అడిగి తెలుసుకుంటూ వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ముఖ్యంగా నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు చేసేలా చూడాలని కాంట్రాక్టర్లకు, స్థానిక నేతలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహితం సహకరించాలని ఆయన కోరారు. అనంతరం స్థానికంగా ఉన్న గాంధీ విగ్రహం ను పరిశీలించిన ఎమ్మెల్యే విగ్రహం దిమ్మెను నూతనంగా నిర్మించాలని స్థానిక నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, యువ నేత అందె మోహన్, సీనియర్ నాయకులు ఇబ్రహీం, జమ్రుద్ ఖాన్, యువ నాయకులు ముబారక్, ఖదీర్, గంగ, బీరప్ప, సాయి, దిలీప్, రవి, మసూద్, శ్రీదేవి, భూషణ్, చిన్న, జయప్రకాష్, జావిద్, ఆర్ కృష్ణ, కొండు యాదయ్య, శ్రీను,రాజేందర్, లింగం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 8614 నూతన రేషన్ కార్డులను అందజేసిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో, నూతన రేషన్ కార్డులను అరంఘర్ లోని ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శాసనమండలి చీఫ్ విఫ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు 8614 నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 8614 కార్డులకు లబ్ధిదారులకు అందజేస్తున్నమన్నారు. ప్రస్తుతం 537 కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రేషన్ కార్డులు లేని వారికి కొత్తగా కార్డులు మంజూరు చేసి, నిత్యావసర సరుకులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో నూతన రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేశామని అన్నారు. గత పాలకులు ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నంగా చేసిన ఆర్థిక వ్యవస్థను సరి చేయడంతో సమయం సరిపోతుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంకల్పంతోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం ఒకటొకటిగా నెరవేరుస్తుందన్నారు. గృహజ్యోతి 200 యూనిట్లు వాడే వారు లబ్ధి పొందాలన్నారు. ఉచిత బస్సు మొదలైనప్పటి నుంచి ఆర్టీసీ సంస్థ లాభాల్లో ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, ఆర్డీవో వెంకట్ రెడ్డి, రాజేంద్రనగర్ శంషాబాద్, గండిపేట్ మండలాల తాసిల్దార్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.








# పట్నంలో ఆర్టీఏ తనిఖీలు

**రంగారెడ్డి జిల్లా, మహా:** ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతంలో ఆర్టీఏ వెహికల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రెండు వాహనాలు సీజ్ చేయడం జరిగింది. ఓవర్ లోడ్ తో వెళ్తున్న లారీని, మరో వాహనాని పట్టుకుని జరిమానా విధించి, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో పెట్టడం జరిగింది.

# మట్టిలోంచి హనుమంతుడు విగ్రహం లభ్యం



**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కాలనీలోని సర్వే నంబర్ 234/2 పార్కు స్థలంలో కాలనీవాసులు జెసిపితో చెదను చేస్తుంటే మట్టిలోంచి హనుమంతుడు విగ్రహం బయటపడింది. హనుమంతుడు విగ్రహాని కాలనీవాసులతో పాటు బిజెపి డివిజన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి పలురాజకీయ నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వినయ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కాలనీలోని పార్క్ స్థలంలో వీరాంజనేయ స్వామి మంగళవారం రోజు బయటికి వచ్చి స్వయంభుగా కాలనీలో వెలిచాడు. స్వామి వారికి గుడి నిర్మాణం చేపడతామన్నారు. సొసైటీ కి సంబంధించిన పలువురు నాయకులు పార్క్ స్థలంలో ఆంజనేయుని విగ్రహం ఇక్కడి నుంచి మరోచోటకు మార్చాలని కాలనీవాసులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. స్వయంభుగా వెలసిన ఆంజనేయస్వామిని ఇక్కడి నుంచి తొలగిస్తామన్న ఆలోచన మానుకోవాలని బిజెపి డివిజన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి సొసైటీ సభ్యులను హెచ్చరించారు. కాలనీవాసులకు బిజెపి, ఆర్ఎస్ఎస్, బజరంగ్దళ్ అండగా ఉంటుందన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**



**హన్మకొండ మహా;** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో పైలట్ గ్రామాలైన హసన్ పర్తి మండలం పెంబర్తి, ఎల్కతుర్తి మండలం వీర నారాయణపూర్ లో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో కలెక్టర్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి గురించి కలెక్టర్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఇల్లు మొదలు పెట్టని, బేస్మెంట్ వరకు వచ్చి ఆగిన ఇండ్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మొదలుపెట్టి ఆరు నెలలు అవుతుందని, ఇంకా ఇండ్ల నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడం సరైంది కాదన్నారు. నిర్మాణ పనులు వేగంగా సాగాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం రూ. 5 లక్షల ను మంజూరు చేస్తుందని, వివిధ దశలకు ప్రభుత్వం అందిస్తున్నందున లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. బేస్మెంట్ వరకు వచ్చిన ఇండ్ల నిర్మాణ పనులు మరింత ముందుకు సాగాలని, లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులు అలాగే నిలిపివేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఇండ్ల నిర్మాణ పనులు ముందుకు సాగకపోతే వాటిని క్యాన్సిల్ చేసి తదుపరి జాబితాలోని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామన్నారు. లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, ఎల్కతుర్తి తహసీల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీవో రవి, ఇతర అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, స్థానికులు ఉన్నారు.



# ఎంజిఎం మార్చురీ కమ్ ఫ్రీజర్ల మరమ్మత్తులు ప్రారంభం

**ఆధునిక సౌకర్యాల కొరకు నిధుల మంజూరు చేసిన కలెక్టర్**

**వరంగల్ మహా;** వరంగల్ ఎంజిఎం ప్రభుత్వ ఆసుపత్రిలో శవాల నిర్వహణకు మరింత సౌకర్యంగా ఉండేందుకు, మార్చురీ విభాగంలో మార్చురీ కమ్ఫ్రీ జర్ల మరమ్మతుల పనులు ప్రారంభమైనట్లు ఎంజిఎం పర్యవేక్షకులు కిషోర్ నేడోక ప్రకటన లో తెలిపారు. గత కొన్ని రోజులుగా ఫ్రీజర్లు పనిచేయక శవాలను భద్రపర్చుటకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక దృష్టి సారించి రూ 4.95 లక్షల ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ పనులను సర్ఫ్ సైంటిఫిక్ వారు చేయడంతో పాటు ఒక సంవత్సర కాలం నిర్వహణ (మెయింటెనెన్స్) చేస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక ఆదేశాల మేరకు, ఆసుపత్రిలో రోజురోజుకీ పెరుగుతున్న శవాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, మార్చురీ విభాగంలో శవాల భద్రతతో కూడిన నిర్వహణ కోసం మార్చురీ కమ్ ఫ్రీజర్ల ఏర్పాటు చేయడం, అవసరమైన పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆసుపత్రికి వచ్చే బాధిత కుటుంబాలకు మరింత మానవీయంగా సేవలందించేందుకు మార్గం సుగమం అవుతుందని ఆసుపత్రి పర్యవేక్షకులు తెలిపారు.

# నాణ్యతను పాటించి పనులను శరవేగంగా పూర్తి చేయండి

**కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్ర నగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్,శీలం కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,జిహెచ్ఎంసి,వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. సిసి రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని,వర్షాల దృశ్యం నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు తెలుపడంతో సిసి రోడ్డు పనులకు నూతన ఎస్టిమేషన్ లు వేసి వీలైనంత త్వరగా పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ లో మార్పులు చేర్పులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు నరసింహమూర్తి, బిజెపి డివిజన్ ప్రెసిడెంట్ పాండు యాదవ్,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్,సూపర్ వైజర్ లోక్ నాథ్, శీలం శ్రీరాములు,మన్మోహన్ రెడ్డి,శీలం లక్ష్మయ్య,మధుసూదన్ రెడ్డి,అంజయ్య,రాజు,విజయ్, శ్రీకాంత్ రెడ్డి, శివయ్య ప్రశాంత్,మహేందర్,బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను వీక్షించిన బిఆర్ఎస్ నేతలు

**హన్మకొండ మహా;** కాళేశ్వరం ప్రాజెక్టు పై ఇటీవల ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తుత్తునియలు చేస్తూ వాస్తవ వివరాలతో మాజీమంత్రి హరీష్ రావు మంగళవారం హైదరాబాదు తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని హన్మకొండ జిల్లా లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్, వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, తదితర నాయకులతో కలసి రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ హరిరమా దేవి వీక్షించారు.

# ముస్లిం ఉద్యోగుల ఐక్యతకు సలాం

- **లక్ష నలభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి, మానవతను చాటుకున్న టీజీ ముస్లిం ఉద్యోగులు**
- **600 మంది ఉద్యోగులతో వాట్సప్ గ్రూపు ఏర్పాటు**



**వరంగల్ మహా;** మానవత్వానికి ప్రతీకగా నిలిచారు రాష్ట్ర ముస్లిం ఉద్యోగులు. తోటి మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు, ఒక పిలుపుతో స్పందించిన వారి మానవత్వానికి సలాం అంటున్న టిజిటిఏ స్టేట్ సహాధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్. వివరాల్లోకి వెళితే.. వరంగల్ కు చెందిన ఖాజా రఫీక్, మెడికల్ శాఖలో సూపరిండెంట్ పనిచేస్తూ, గత కొంతకాలంగా తీవ్రమైన క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ, ఆర్థిక ఇబ్బందులలో కొట్టు మిట్టాడుతూ దయనీయమైన స్థితిలో చనిపోయారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ముస్లిం ఉద్యోగులు తక్షణమే స్పందించి లక్ష నలభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి మానవతను చాటుకున్నారు. ఒక్కరి ఆలోచనతో వందల మంది ముందుకు ఇటీవల రాష్ట్రంలో చాలా మంది తోటి ముస్లిం ఉద్యోగులు అనారోగ్య కారణంతో చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతూ ఉండగా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసి, ఏదో విధంగా తెలంగాణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులను ఏకతాటి పైకి తీసుకుని రావాలని తోటి ముస్లిం ఉద్యోగులకు సహాయం చేయాలనే సంకల్పంతో ఒక సంక్షేమ సంఘం లాంటిది ఏర్పాటు చేయాలనే ఆలోచన భూపాలపల్లి జిల్లా డిప్యూటీ తహశీల్దార్ షఫీ సర్కార్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ టీఎన్జీవోస్ కేంద్ర సంఘం (తెలంగాణ రాష్ట్ర ముస్లిం సంఘం వ్యవస్థాపకులు చైర్మెన్ కి రావడంతో, ఆయన వెంటనే తన అభిప్రాయాన్ని వరంగల్ తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్, స్టేట్ సహాధ్యక్షులు టిజిటిఏ తో మాట్లాడి తరువాత వారి అభిప్రాయంతో, ఇంటెలిజెన్స్ శాఖ డీఏవో గా పనిచేసే మాశూక్ పాషాలతో చర్చించారు. ఈ ముగ్గురు ఉద్యోగులు ఏకమై, రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులను ఐడెంటిఫై చేసి, రాష్ట్ర వ్యాప్తంగా వారి బంధుమిత్రులు, తెలంగాణ రాష్ట్రంలో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరితో ఫోన్లో సంప్రదింపులు చేసి, వాట్సాప్ సామాజిక వేదిక ద్వారా, తెలంగాణ ముస్లిం ఉద్యోగుల సంక్షేమ సంఘం తో ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. మొదట సుమారుగా 2500 మందితో రెండు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి, అందులో ఉన్న వారికి ఒక గూగుల్ ఫార్మ్ పంపించి వారి వివరాలు రాసి పంపించాలని కోరారు. 600 మంది వరకు గూగుల్ ఫామ్ ఫిల్ చేసి వివరాలు పంపివ్వగా, పంపిన 600మందితో రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం ఉద్యోగుల సొసైటీ లాగా ఏర్పాటు చేసుకుందామని ఉద్దేశంతో ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. త్వరలో ఈ 600 మంది రాష్ట్ర స్థాయి మీటింగ్ కూడా వరంగల్ లో ఏర్పాటు చేసి, సంఘం విధి విధానాలు, అదేవిధంగా రాష్ట్రస్థాయి నాయకులను ఎన్నుకోవాల్సి ఉన్న క్రమంలోనే, ఇదే గ్రూపుకు చెందినటువంటి ఖాజా రఫీక్ మెడికల్ శాఖలో సూపరిండెంట్ గా పనిచేస్తూ అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో, కలత చెందిన రాష్ట్ర ముస్లిం ఉద్యోగులందరూ విశాల హృదయంతో తమకు తోచినంత సహాయం చేసి 1,40,000రూపాయలు వసూలు చేసి వరంగల్ లోని వారి నివాసానికి వెళ్ళి వారి ఫ్యామిలీకి అందించారు. ఆర్థిక సహాయంతో పాటు, వారికి రావలసిన ప్రభుత్వ బెనిఫిట్స్ అన్ని అందించే వరకు, ఇంట్లో ఒకరికి పెన్షన్ సౌకర్యం, అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సైతం కల్పించే విధంగా వారికి అండగా ఉంటామని మహమ్మద్ ఇక్బాల్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

# ఇంటింటికి బిజెపి – మహా సంపర్క్ అభియాన్



**రంగారెడ్డి జిల్లా మహా:** బొమ్మనపల్లి గ్రామంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటికి బిజెపి బూత్ స్థాయి మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని కాట్రావత్ జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం, బొమ్మనపల్లి గ్రామంలో బీజేపీ అచ్చంపేట మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి, మాజీ మండల అధ్యక్షులు వరికుప్పల ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై, ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సాగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మండలం ఉపాధ్యక్షులు పంగ బాలస్వామి, గ్రామ సభ్యులు మల్లాజీ, భగవంతు,కోటేష్ ఆంజనేయులు,మహేష్, నరేష్,లింగస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మందమర్రి జిఎం కార్యాలయం ముందు సిపీఎం ధర్నా

**పని స్థలాలలో రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.. పని ఉత్పత్తి లక్ష్యాలు తప్ప రక్షణ వ్యవస్థపై పట్టింపు లేదు**

**మందమర్రి, మహా :** నేడు మందమర్రి ఏరియా జిఎం కార్యాలయం ముందర సిపిఎం ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా సిపిఎం కార్యదర్శి సంకె రవి పిలుపునిచ్చారు. మంగళవారం సింగరేణి కాలరీస్ కంపెనీ వ్యవహరిస్తున్న విధానాలపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 6 మధ్యాహ్నం 3 గంటలకు మందమర్రి జిఎం కార్యాలయం ముందర సిపిఎ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కంపెనీలో అమలు జరుపుతున్న ప్రయివేటికరణలో విధానాల మూలంగా సింగరేణి సంస్థకు అపకీర్తి వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడు విధులు నిర్వహిస్తున్న వివిధ పనుల ప్రదేశాల్లో రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు ప్రమాదాలు జరిగితే గాయపడ్డ వ్యక్తులను తీసుకు వెళ్లేందుకు అందుబాటులో అంబులెన్సులు, వైద్య సౌకర్యాలు అందుబాటులో లేవని అన్నారు. పనులు ఉత్పత్తి లక్ష్యాలు తప్ప రక్షణ వ్యవస్థపై యాజమాన్యానికి, వివిధ గనుల అధికారులకు పట్టింపు లేదని పేర్కొన్నారు. అధికారుల వేధింపుల వల్ల ఈమధ్య చాలామంది కార్మికులు మానసిక ఒత్తిడికి గురవుతూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. గనులలో యాజమాన్యం పగడ్బందిగా రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని, చనిపోయిన, గాయాల పాలైన కార్మికులను,వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో వీలైనంత తొందరగా ప్రయివేటీకరణ విధానాలను నిలిపివేసి, ప్రమాదాలకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందని ప్రకటనలో సంకె రవి వెల్లడించారు.





# సహారా ఇండియా పరివార్ డిపాజిట్లు ఇవ్వాలి

**నస్పూర్ సిసిసి కార్యాలయం ముందర డిపాజిట్ దారుల నిరసన**

**మంచిర్యాల, మహా :** సహారా ఇండియా పరివార్ డిపాజిట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నస్పూర్ సిసిసి కార్యాలయం ముందర డిపాజిట్ దారులు ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన ప్రదర్శన చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సహారా బాధితులు మాట్లాడుతూ కాల పరిమితి దాటిన సహారా డిపాజిట్ లను వెంటనే చెల్లించాలని అన్నారు. సహారా ఇండియా పరివార్ లో డబ్బులు జమ చేసుకుంటే వృద్ధాప్యంలో ఖర్చులకు, పిల్లల వివాహాలకు, చదువులకు, గృహ నిర్మాణాలకు తదితర అవసరాలకు ఉపయోగపడతాయని జమ చేసుకుంటే వాటిని ఇవ్వకుండా సంస్థ కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపాజిట్ గడువు పూర్తయిపోయి డబ్బులను చెల్లించకుంటే తాము ఆర్థిక ఇబ్బందులతో ఆత్మ హత్యలు చేసుకునుడే తప్ప మరో మార్గం లేదని హెచ్చరించారు. సహారా బాధితులను సమస్యల పై పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానందలు, వివిధ పార్టీలకు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, స్పందించి న్యాయం చేసే విధంగా కృషి చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో సహారా బాధితుల సంఘం నాయకులు గజెల్లి వెంకటయ్య, సహారా బాధితులు బొద్దున దుర్గయ్య , మాచెర్ల శ్రీనివాస్, మోతె కాంతయ్య , మిట్ట రమాదేవి , డి తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.




## టెస్లా సెకెండ్ షోరూం ప్రారంభానికి

# రంగం సిద్ధం..

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీ (Delhi)లో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీ (Aerocity)లో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది. ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది.

### 'Y' మోడల్ కార్ల అమ్మకాలు..


ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. RWD (రియర్‌వీల్ డ్రైవ్), లాంగ్‌రేంజ్ RWD వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్‌వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్‌రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే RWD వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్‌రేంజ్ వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.

## ఆల్ టైమ్ రికార్డ్.. ఒక్కరోజే 70 కోట్ల యూపీఐ లావాదేవీలు!

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సరికొత్త మైలురాయిని చేరుకుంది. చరిత్రలో తొలిసారి ఈ నెల 2న ఒకే రోజులో ఏకంగా 70 కోట్ల లావాదేవీల మైలురాయిని అధిగమించి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. గత రెండేళ్లలో రోజువారీ లావాదేవీల సంఖ్య రెట్టింపు అయ్యింది. 2023 ఆగస్టులో యూపీఐ రోజుకు దాదాపు 350 మిలియన్ల (35 కోట్ల) లావాదేవీలను నమోదు చేసింది. ఇక గతేడాది ఆగస్టులో దాదాపు 500 మిలియన్ల (50 కోట్ల) లావాదేవీలు జరిగాయి. కాగా, ఈ ఏడాది జూన్ నాటికి దేశంలో రోజువారీ యూపీఐ లావాదేవీల సగటు 61.3 కోట్లు దాటిపోయింది. వాటి విలువ రూ.80 వేల కోట్లు. కేవలం కొన్ని వారాల్లోనే ఈ సంఖ్య 70 కోట్లు దాటడం విశేషం. 2027 నాటికి రోజువారీ యూపీఐ లావాదేవీల సంఖ్య 100 కోట్లకు చేరుకుంటుందని నిపుణుల అంచనా. భవిష్యత్తులో రోజుకు 100 కోట్ల లావాదేవీలను చేరుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని యూపీఐ నిర్వాహక సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పేర్కొంది. సులభమైన వినియోగ విధానం, వ్యాపారుల నుంచి లభిస్తున్న ఆదరణే ఈ వృద్ధికి కారణమని ఎన్‌పీసీఐ తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 49.1 కోట్ల మంది వినియోగదారులు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని వాడుతున్నారు.

**రూ.80 వేల కోట్లకు పెరిగిన విలువ**


2016లో సాధారణంగా ప్రారంభమైన యూపీఐ చెల్లింపులు ఇప్పుడు తారాస్థాయికి చేరాయి. 2017 జూన్‌లో యూపీఐ లావాదేవీల రోజువారీ సగటు 3.5 లక్షలుగా ఉండగా.. ఈ ఏడాది జూన్ నాటికి అది 1,750 రెట్లు పెరిగి 61.3 కోట్లకు చేరింది. ఇదే సమయంలో రోజువారీ యూపీఐ లావాదేవీల విలువ రూ.80 వేల కోట్లు దాటిపోయింది.




## ఫైలింగ్ తర్వాత 30 రోజుల్లో వెరిఫై చేయకపోతే

# మీ ఐటీ రిటర్న్స్ చెల్లదు..!

మీరు ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేశారా..? అయితే అంతటితో మీ పని పూర్తి కాలేదు. ఆన్‌లైన్ లో రిటర్న్‌లు అప్‌లోడ్ చేసిన తర్వాత 30 రోజుల్లోగా వాటిని తప్పనిసరిగా వెరిఫై చేయాల్సి ఉంటుందని, లేదంటే ఆదాయపు పన్ను శాఖ మీరు దాఖలు చేసిన ఆ రిటర్న్స్‌ను చెల్లనివిగా పరిగణిస్తుందని ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. కేవలం ఈఫైలింగ్ వెబ్‌సైట్‌లో వివరాలు సమర్పించినంత మాత్రాన ప్రక్రియ ముగిసినట్లు కాదని నిపుణులు చెబుతున్నారు. 202526 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి ఐటీఆర్ ఫైల్ చేసేందుకు పొడిగించిన గడువు సెప్టెంబర్ 15 తో ముగియనుంది. ఇప్పటికే చాలామంది పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ఫైలింగ్ తర్వాత అత్యంత కీలకమైన వెరిఫికేషన్ దశను నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. గడువులోగా వెరిఫై చేయని రిటర్న్‌లను ఆదాయపన్ను శాఖ ప్రాసెస్ చేయదు. పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రెండు




పద్ధతుల్లో వెరిఫై చేయవచ్చు. అందులో మొదటిది సులభమైన ఈవెరిఫికేషన్ పద్ధతి. రెండోది ఆఫ్‌లైన్ పద్ధతి. ఆన్‌లైన్‌లో అయితే ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా క్షణాల్లో వెరిఫికేషన్ పూర్తి చేయవచ్చు. ఇది చాలా సులభమైన, వేగవంతమైన పద్ధతి. ఇందుకు ఈఫైలింగ్ పోర్టల్ (incometax.gov.in) లోకి లాగిన్ అయి, 'ఈవెరిఫై రిటర్న్' ఆప్షన్ ఎంచుకోవాలి. అక్కడ 'ఆధార్ ఓటీపీ'ని సెలెక్ట్ చేసుకుని, మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేస్తే సరిపోతుంది. నెట్ బ్యాంకింగ్, డీమ్యాట్ ఖాతా, ఏటీఎంల ద్వారా ఎలక్ట్రానిక్ వెరిఫికేషన్ కోడ్ జనరేట్ చేసి కూడా ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ ఉన్నవారు దాని ద్వారా కూడా వెరిఫై చేసుకోవచ్చు. ఒకవేళ ఆఫ్‌లైన్ పద్ధతిని ఎంచుకుంటే, ఐటీఆర్‌వి అకనాలెడ్జ్‌మెంట్ ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, దానిపై సంతకం చేసి, ఫైల్ చేసిన 30 రోజుల్లోగా బెంగళూరులోని సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌కు పోస్టులో పంపాలి. అయితే ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. ఏదైనా కారణంవల్ల 30 రోజుల గడువులోగా మీరు ఐటీఆర్ వెరిఫికేషన్ పూర్తి చేయలేకపోతే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈఫైలింగ్ పోర్టల్‌లోనే 'కండోనేషన్ ఆఫ్ డిలే అని అభ్యర్థన పెట్టుకోవచ్చు. ఆలస్యానికి గల కారణాలను వివరిస్తూ అభ్యర్థన సమర్పిస్తే ఆదాయపు పన్ను శాఖ దాన్ని ఆమోదించే అవకాశం ఉంటుంది. ఐటీ శాఖ ఆమోదం తెలిపితే మీ రిటర్న్ వెరిఫై అయినట్లుగా పరిగణిస్తారు.

## విండోస్ 10 యూజర్లకు మైక్రోసాఫ్ట్ గుడ్‌న్యూస్






విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ వాడుతున్న యూజర్లకు అలెర్ట్. ఈ ఏడాది అక్టోబర్ 14 తర్వాత నుంచి మైక్రోసాఫ్ట్ అప్‌డేట్స్, సెక్యూరిటీ ప్యాచ్‌లను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఇకపై ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించి అన్ని సేవలు నిలిచిపోనున్నాయి. అయితే, ఇప్పటికప్పుడు యూజర్లు అందరూ భయపడాల్సిన అవసరమేమీ లేదు. సాధారణ ట్రిక్‌తో సంవత్సరం పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందే అవకాశం ఉన్నది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10 యూజర్ల కోసం ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ పేరుతో ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇప్పటికప్పుడు విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌కి మారకుండా, హార్డ్‌వేర్ సపోర్ట్ చేయని యూజర్లను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోగ్రామ్‌ను తీసుకు వచ్చింది. వినియోగదారులు ఇందులో వినియోగదారులు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందుతారు. అయితే, కొత్త ఫీచర్లు, టెక్ సపోర్ట్ మాత్రం ఉండదు. అయితే, ఈ సేవలను పొందేందుకు యూజర్లు 30 డాలర్లు (రూ.2500) ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. పీసీ బ్యాకప్ చేసి ఉంటే.. మైక్రోసాఫ్ట్ రివార్డ్ పాయింట్లు ఉంటే ఈ సేవలను మాత్రం ఉచితంగా పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మీరు వాడుతున్న విండోస్ 10 సిస్టమ్ వాడుతున్న అందరికీ మైక్రోసాఫ్ట్ ఉచితంగానే విండోస్ 11 ఉచితంగా ఇన్‌స్టాల్ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నది. 10 ఓఎస్‌ను కొనసాగించాలనుకునే వారికి ఈఎస్‌యూ (ESU) తీసుకోవచ్చని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.




## అతను నా జీవితాన్ని నాశనం చేశాడు

### పుతిన్‌పై రహస్య కుమార్తె సంచలన వ్యాఖ్యలు





రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అతని రహస్య కుమార్తెగా చెప్పుకునే 22 ఏండ్ల ఎలిజవేటా క్రివోనోగిఖ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'అతను నా జీవితాన్ని నాశనం చేయడంతో పాటు లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్నాడు' అంటూ టెలిగ్రామ్ చానల్‌లో పోస్టు పెట్టారు. 'నా ముఖాన్ని మళ్లీ ప్రపంచానికి చూపించడం అనేది నాకు విముక్తినిస్తుంది. నేను ఎవరో.. నా జీవితాన్ని ఎవరు నాశనం చేశారనేది నాకు గుర్తు చేస్తుంది' అని రాసుకొచ్చారు. అయితే, ఆ పోస్ట్‌లో ఎవరి పేరూ ప్రస్తావించనప్పటికీ.. ఈ వ్యాఖ్యలు పుతిన్‌ని ఉద్దేశించే అని ప్రచారం జరుగుతోంది. ఎలిజవేటా క్రివోనోగిఖ్ 2003లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జన్మించింది. పుతిన్, ఆయన మాజీ ఉద్యోగి స్వెత్లానా క్రివోనోగిఖ్‌కు జన్మించిన రహస్య కుమార్తెగా అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. ప్రస్తుతం ఎలిజవేతా పారిస్‌లో నివసిస్తోంది. స్వెత్లానా ఒకప్పుడు సాధారణ క్లీనింగ్ వర్కర్‌గా పనిచేసి, పుతిన్ అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా రష్యన్ మిలియనీర్‌గా అవతరించారు. ఈ సంపద పుతిన్ ద్వారా పొందారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో 2020లో స్వెత్లానా క్రివోనోగిఖ్ ఆస్తులపై దర్యాప్తు చేసిన సమయంలో ఎలిజవేటా క్రివోనోగిఖ్.. పుతిన్ రహస్య కుమార్తె అని తేలినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

## భారీగా పెరిగిన బంగారం ధరలు..

పసిడి ధర పరుగులు తీస్తూనే ఉంది. శ్రావణమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారానికి భారీగా డిమాండ్ పెరిగింది. దాంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇవాళ బంగారం ధర తులంపై ఏకంగా రూ.820 ఎక్కువైంది. బంగారంతోపాటు వెండి ధర కూడా చుక్కలు చూపిస్తోంది. కిలో వెండి ధర ఏకంగా రూ.2 వేలు పెరిగింది. మంగళవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.820 పెరిగి రూ.1,02,220 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.750 పెరిగి రూ.93,700 వద్ద ట్రేడవుతోంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.76,700కు చేరింది. అదే సమయంలో వెండి ధర కూడా పెరుగుతోంది. కిలో వెండి ధర ఏకంగా రూ.2 వేలు పెరిగి రూ.1,15,000 వద్ద ట్రేడవుతోంది. కర్ణాటక రాజధాని బెంగళూరు, దేశ రాజధాని ఢిల్లీ,



మహారాష్ట్ర రాజధాని ముంబై, పశ్చిబెంగాల్ రాజధాని కోల్‌కతాలో కూడా బంగారం ధరలు ఇదేవిధంగా ఉన్నాయి. అయితే చెన్నైలో మాత్రం మరో రూ.10 వేల ఎక్కువ ధర ఉంది.

## కాలిఫోర్నియాలో కార్చిచ్చు.. 65 వేల ఎకరాల్లో మంటలు

అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో భారీ కార్చిచ్చు సంభవించింది. గత శుక్రవారం మొదలైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. కార్చిర్చు కారణంగా దట్టమైన పొగలు అలుముకుని గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 'గిఫోర్డ్ ఫైర్' గా పేర్కొనే ఈ కార్చిచ్చు ప్రస్తుతం 65 వేల ఎకరాలకు పైగా విస్తరించింది. భారీగా మంటలు ఎగిసిపడుతుండటంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. లాస్ ఏంజిల్స్, వెంచురా, కార్న్ వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసితులతో పాటు పొరుగునున్న లాస్ వెగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గాలినాణ్యత క్షీణిస్తుండటంతో పలు సూచనలు జారీ చేశారు. ప్రభావం ఎక్కువగా ఉండే సమీప ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నారు. మరోవైపు మంటలను అదుపు చేసేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటికి 3 శాతం మంటలను మాత్రమే అదుపులోకి తీసుకురాగలిగామని అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితుల కారణంగా అడ్డంకులు తప్పడం లేదన్నారు. మంటలవల్ల చుట్టుపక్కల రహదారులను కూడా అధికారులు మూసేశారు. దాంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రానున్న రోజుల్లో వాతావరణం మరింత వేడెక్కనుందని, పరిస్థితులు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.




## నిజమైన భారతీయులెవరో చెప్పేది జడ్జీలు కాదు: ప్రియాంకా గాంధీ



**న్యూఢిల్లీ:** చైనా మన భూభాగాన్ని ఆక్రమించినట్లు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం సుప్రీంకోర్టు సీరియస్ అయిన విషయం తెలిసిందే. నిజమైన భారతీయులు అలా మాట్లాడరు అని కోర్టు ఆ కేసులో పేర్కొన్నది. కోర్టు చేసిన వ్యాఖ్యలపై రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీస్పందించారు. ఇవాళ పార్లమెంట్ ఆవరణలో అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాహుల్‌ను సమర్థించారు. ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని ఆమె అన్నారు. నిజమైన భారతీయులు కాదా అన్న స్టేట్మెంట్‌పై మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి గౌరవం ఉందని, కానీ నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు అని ఆమె అన్నారు. రాహుల్ గాంధీ సైన్యాన్ని, సైనికులను ఎల్లప్పుడూ గౌరవించారని ఆమె పేర్కొన్నారు. నిజమైన భారతీయుడు ఎవరన్న దానికి నిర్వచనం ఎవరు ఇస్తారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేస్తే సమాధానం ఇవ్వడం లేదని, కానీ పార్లమెంట్ బయట మాట్లాడితే జాతి వ్యరేకులమని ముద్ర వేస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి సందర్భంలో నిజమైన భారతీయుడికి నిర్వచనం ఎవరు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. మేం నిజమైన భారతీయులమని, అందుకే దేశం తరపున ప్రశ్నలు వేస్తున్నామన్నారు.

## ఉత్తరకాశీలో జలప్రళయంపై విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉత్తరకాశీ జిల్లాలో సంభవించిన జలప్రళయంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రస్తుత పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ కి ఫోన్ చేసి ప్రధాని మాట్లాడారు. ఉత్తరకాశీలోని ధరాలీ గ్రామాన్ని వరదలు ముంచెత్తడం విచారకరం, బాధితులంతా క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నా' అని ప్రధాని చెప్పారు. ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఉత్తరకాశీ జిల్లాను వరద చుట్టుముట్టింది. క్లౌడ్‌బరస్ట్ కారణంగా కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి ఖీర్ గంగా నది ఒక్కసారిగా ధరాలీ గ్రామంపై విరుచుకుపడింది. భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. వరద ప్రవాహం ధరాలీ గ్రామాన్ని ముంచెత్తడంతో వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఊహించని జలప్రళయంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ విపత్తులో దాదాపు 60 మంది గల్లంతయ్యారు. నలుగురు మృతిచెందారు. సమాచారం అందుకున్న ఆర్మీ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన భయానక దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.





# ఎస్క్వైర్ ఇండియా మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన ఎన్టీఆర్

తన నటనతో స్టార్ నటుడిగా గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఇండియాకు చెందిన ఎస్క్వైర్ మ్యాగజైన్ కవర్‌పై ఎన్టీఆర్‌ను ప్రచురించారు నిర్వహాకులు. 'ఫ్రమ్ టీన్ ప్రాడిజీ టు పాన్-ఇండియా పవర్‌హౌస్' (టీనేజ్ సంచలనం నుంచి పాన్-ఇండియా శక్తిగా) మారిన స్టార్ నటుడంటూ రాసుకోచ్చింది. మెరున్ కలర్ షేర్వానీ ధరించిన ఎన్టీఆర్ కూర్చీలో కుర్చుని స్టైలీష్‌గా కనిపిస్తున్నాడు. ఇక ఈ ఫొటో షూట్ దుబాయ్‌లో జరిగినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది. అతడిలో చరిష్మా ఉంది. చాలా చురుకైన వ్యక్తి. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఉన్న స్టార్ నటులలో అతడు కూడా ఒకరు. గొప్ప కుటుంబంలో పుట్టినప్పటికీ.. ఆ వారసత్వానికి కట్టుబడి ఉండాలని ఆయన ఎప్పుడూ కోరుకోలేదు. అతడే ఎన్టీఆర్. అతడి సినీ ప్రయాణాన్ని మా ఆగష్టు సంచికలో మేము సెలబ్రేట్ చేయబోతున్నాం. ఇది అతడి తొలి మ్యాగజైన్ కవర్ కూడా అంటూ ఎస్క్వైర్ రాసుకోచ్చింది. సినిమాల విషయానికి వస్తే.. ఎన్టీఆర్ ప్రస్తుతం వార్ 2 సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ త్వరలోనే తెలుగు తెరపై సందడి చేయనుందా? అంటే అవుననే అంటోంది టాలీవుడ్. రేస్, రైడ్, వెల్కమ్, హౌస్‌ఫుల్, ఫతే వంటి చిత్రాలతో బాలీవుడ్ ప్రేక్షకులను ఆలరించిన జాక్వెలిన్‌ని 'పేపర్ బాయ్' ఫేం జయశంకర్ టాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాడు. ఆయన దర్శకత్వం వహించే ఓ ఉమెన్ సెంట్రిక్ మూవీలో జాక్వెలిన్ కీలక పాత్ర పోషించబోతున్నట్లు సమాచారం. జయశంకర్ ఆల్రెడీ జాక్వెలిన్‌కు యాక్షన్, సస్పెన్స్‌తో నిండిన ఒక ఇంటెన్స్ స్క్రిప్ట్‌ను వివరించారట. జాక్వెలిన్‌కు జయశంకర్ చెప్పిన పాత్ర, కథ చాలా నచ్చినట్టుగా తెలుస్తోంది. స్క్రిప్ట్ కొన్ని

# టాలీవుడ్ డైరెక్టర్‌తో ఫెర్నాండేజ్ సినిమా!

హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలతో నిండి ఉన్నందున జాక్వెలిన్ కూడా పాత్రను పోషించేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని తెలుస్తోంది. దీంతో జాక్వెలిన్ సైతం ఈ ప్రాజెక్ట్‌కు అనుమతి ఇచ్చినట్టుగా సమాచారం. ఈ చిత్రం యాక్షన్ థ్రిల్లర్‌గా ఉంటుందని, జాక్వెలిన్ ఇది వరకు ఎప్పుడూ చూడని పాత్రలో చూడబోతోన్నట్టుగా తెలుస్తోంది. స్క్రిప్ట్‌లో వీఎఫ్ఎక్స్‌కు సంబంధించిన వర్క్ కూడా చాలా ఉందని సమాచారం. ప్రేక్షకుల్ని కట్టి పడేసేలా థ్రిల్లింగ్ వీఎఫ్ఎక్స్ అంశాలతో చిత్రం రూపొందనుందట. జాక్వెలిన్ పాన్ ఇండియా నటి కావడంతో ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీ, హిందీ భాషల్లో నిర్మించనున్నారట. దర్శకుడు ప్రస్తుతం స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నట్టుగా తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్టుగా సమాచారం.




# నువ్వు నిజంగానే దేవుడివయ్యా.. సూర్యపై ప్రశంసలు

నటుడు సూర్య నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ అగరం ఫౌండేషన్. ఈ ఫౌండేషన్ ద్వారా అనేక మంది పేద విద్యార్థులకు విద్యాదానం చేస్తున్నారు. కాగా అగరం ఫౌండేషన్ స్థాపించి 15 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా చెన్నైలోని ఒక ప్రైవేట్ కళాశాలలో వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు శివ కుమార్, సూర్య, కార్తీ, జ్యోతిక, దర్శకుడు జ్ఞానవేల్, వెట్రిమారన్ నిర్మాత కలైపులి ఎస్ ధాను, డ్రమ్స్ శివమణి ప్రముఖులు పాల్గొని, అగరం ఫౌండేషన్ విద్యా సేవలను కొనియాడారు. ఈ వేడుకకు నటుడు, మక్కల్ నీతిమయ్యం పార్టీ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు కమలహాసన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నటుడు సూర్య మాట్లాడుతూ ఇది అగరం ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం అని విద్య అనేది ఆయుధం అన్నదే అగరం ఫౌండేషన్ నమ్మకం అని, అది ఈరోజు నిజం అయ్యిందని పేర్కొన్నారు. విద్య అనేది చదువు మాత్రమే కాదని విద్యార్థులకు మన సాంప్రదాయాన్ని నేర్పించేదన్నారు. వారి ప్రతిభను వెలికి తీసే పనిని అగరం ఫౌండేషన్ చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కష్టపడే విద్యార్థులకు అగరం ఫౌండేషన్ విద్యాసేవలు అందిస్తుందని, విద్య ఎంత మార్పు తీసుకొస్తుందన్నది గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు తెలియజేయాలన్నదే ఆగరం ఫౌండేషన్ ప్రయత్నం అని సూర్య పేర్కొన్నారు.

## 15 ఏళ్ల ప్రయాణం..51 మంది వైద్యులు

కాగా అగరం ద్వారా ఈ 15 ఏళ్లలో 51 మంది విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించి, వైద్యులు అయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు ఈ సంస్థ నుంచి సుమారు 8 వేలకు పైగానే విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. రెట్రో సినిమా లాభాల్లోంచి రూ.10 కోట్లు అగరం ఫౌండేషన్‌కు సూర్య విరాళంగా ఇచ్చారు. పేదవారికి అండగా నిలబడుతున్న సూర్య నిజంగానే దేవుడు అంటూ సోషల్‌మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కమలహాసన్ మాట్లాడుతూ విద్య,ప్రేమ ఒకే చోట లభించడం సాధ్యం కాదన్నారు. అయితే అది అమ్మ వద్ద, అగరం వద్ద లభిస్తాయన్నారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసే వారికి లభించేది ముళ్ల కిరీటాలేన్నారు. తాను విద్యను నేర్చుకునే తీరుతాను, ఇతరులకు నేర్పించే తీరుతాను అనేది ఒక సాగదీత ప్రక్రియగా పేర్కొన్నారు. 2017 తర్వాత విద్యార్థుల వైద్యవిద్య అనేది కొనసాగలేక పోతోందన్నారు. కారణం నీట్ పరీక్ష అని పేర్కొన్నారు. అందుకే నీట్ పరీక్షలు వద్దని తాము చెబుతున్నామన్నారు. అందుకు చట్టాన్ని మార్చే బలం విద్యకే ఉందన్నారు. విద్య అనేది ఈ యుద్ధంలో ఆయుధంగా మాత్రమే కాదని, దేశాన్ని చక్కదిద్దేది కూడా అని అన్నారు. సనాతన సంకెళ్లను, సర్వాధికార సంకెళ్లను నుగ్గు నుగ్గు చేసే ఆయుధం విద్య అని కమలహాసన్ పేర్కొన్నారు.




# లవ్... ఎమోషన్‌కి శ్రీకారం

తెలుగులోనూ వరుస విజయాలతో దూసుకెళుతున్న మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తాజాగా ఓ తెలుగు సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రవి నేలకుదిటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాని క్లాప్ కొట్టారు. గుణ్ణం సందీప్, నాని, రమ్య గుణ్ణం స్క్రిప్ట్‌ను టీమ్‌కు అందజేశారు. ''చక్కని లవ్‌స్టోరీతో పాటు అద్భుతమైన హ్యూమన్ డ్రామాగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నాం. తెలుగు, మలయాళ, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: అనయ్ ఓం గోస్వామి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com